




www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
14-06-2024
సంపుటి : 01 | సంచిక : 41 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


V3 NEWS

# సీఎం సిగ్నేచర్స్!

## బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు

సీఎం హోదాలో మెగా డీఎస్సీపై తొలి సంతకం

అన్న క్యాంటీన్ల పునరాగమనం



టీడీపీ నారా చంద్రబాబు నాయడు సీఎంగా గురువారం సాయంత్రం 4.41 గం.కు బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం మొదటి బ్లాక్‌లోని ఛాంబర్‌లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్నికల్లో ఇచ్చిన కీలక హామీల అమలుపై సంతకాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చినట్లుగానే సీఎం హోదాలో మొదట మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛన్ రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం, స్కిల్ సెన్సెస్, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై సంతకాలు చేశారు.

8



# నోరెత్తరేం!

## బయటపడుతున్న అసలు నిజాలు

ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్ గప్ చుప్

అధికారంలో ఉండి విర్రవీగిన నేతలు

ఎన్నికల సమయంలో బయటపడకుండా మేనేజ్

త్వరలోనే పలువురికి నోటీసులు

నోటీసులపై ఏం సమాధానం చెప్తారో

> అధికారంలో ఉన్న పదేళ్ళు కారు పార్టీ నేతలు ఆకాశమే హద్దుగా రెచ్చిపోయారు. ముఖ్యంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో మరీ విచిత్రంగా వ్యవహరించారు. నార్త్ కొరియాలో ఏమి జరుగుతోందో బయట ప్రపంచానికి తెలీనట్లే కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం అలాగే వ్యవహరించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్ ఏమి చెబితే అది మాత్రమే మీడియాలో వచ్చేది జనాలకు తెలిసేది. పదేళ్ళ అధికారంలో నుంచి దిగిపోయిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి బయటపడుతున్న విషయాలు చూసి జనాలు ఆశ్చర్యపోతున్నారు. ప్రతిపక్షాలు కేసీఆర్ పై రెచ్చిపోతున్నాయి. ఎన్నికల సమయంలోనే కాళేశ్వరంతో పాటు మేడిగడ్డ బండారం బయటపడింది.

**విశ్వంభర, హైదరాబాద్:**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారు. విచారణ మొదలుపెట్టిన జస్టిస్ చంద్ర ఘోష్ కమిటీ ముందుగా ప్రాజెక్టులను నిర్మించిన కంపెనీలకు నోటీసులు ఇచ్చి సమాధానాలను ఇవ్వమని అడిగింది. వీళ్ళ సమాధానాలు చూసుకుని తర్వాత హరీష్ రావు ఆ తర్వాత కేసీఆర్ కు కూడా నోటీసులు ఇవ్వడానికి రెడీ అవుతుంది. హరీష్ కు ఎందుకంటే అప్పట్లో ఇరిగేషన్ మంత్రిగా పనిచేసింది హరీషే. ప్రాజెక్టుల నిర్మాణంపై ఎవరైనా ఆరోపణలు చేసినా కేసీఆర్, హరీష్ వాళ్ళపై విరుచుకు పడిపోయేవారు. ఆరోపణలను చేసిన వారిని తెలంగాణా ద్రోహులుగా చిత్రీకరించేవారు.

**ఎన్నికలు అయిపోయేంత వరకు మాటల్లేవు**

ఎన్నికల సమయంలో **మిగతా2లో...**

## నీట్ పరీక్ష పేపర్లు లీకయ్యాయి

- ప్రమాదంలో విద్యార్థుల భవిష్యత్
- యువత భవిష్యత్తును మోడీ సర్కార్ నాశనం చేసింది
- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే డిమాండ్



9

## విద్యుత్ కొరతకు చెక్

- పదేళ్లలోనే మోడీ ఘనత
- బొగ్గు కొరత లేకుండా చూడటమే కారణం
- బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు



9

## ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతాం

- కీలక బాధ్యతలు అప్పగించిన మోడీకి థ్యాంక్స్
- సమర్థ నాయకత్వం చంద్రబాబు నుంచి నేర్చుకున్నా
- బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ నాయుడు



9

## కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులా?

గుంపు మేస్త్రీ డైవర్షన్ పాలిటిక్స్

ప్రతీకార రాజకీయాలు పక్కన పెట్టండి

బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ధ్వజం

రేవంత్ పాలన అధ్వానంగా ఉంది

సీఎం రేవంత్‌కు దాసోజు బహిరంగ లేఖ



2



# రేవంత్ మరో ముందడుగు

'మహిళా శక్తి క్యాంటీన్ సర్వీస్'లకు సన్నద్ధం

రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు ప్లాన్

సీఎం రేవంత్ ఆదేశాలతో సీఎస్ సమీక్ష

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నిర్ణయం

రెండేళ్లలో 150 క్యాంటీన్ల లక్ష్యంగా ముందుకు

ప్రణాళికలు రూపొందించేలా అధికారులకు ఆదేశాలు

**విశ్వంభర, హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు గుడ్ న్యూస్ చెప్పింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో 'మహిళా శక్తి క్యాంటీన్ సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్రంలో క్యాంటీన్ సర్వీస్ ల ఏర్పాటుపై గురువారం సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, బస్ స్టాండ్‌లు, పారిశ్రామిక ప్రాంతాలలో మహిళా సంఘాల నిర్వహణలో ప్రత్యేకంగా **మిగతా2లో...**

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

2



2

## నా జీవితంలో మొదటి అవకాశం

వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదు

బాధ్యతగా నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తా

ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తీన్మార్ మల్లన్న

ఈ విజయం అమరవీరులకు

## అంకితం

ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

నన్ను గెలిపించిన ప్రతినిధులకు కృతజ్ఞతలు



2



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 136 | ₹ 158 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹230 | ₹262 |

## ఐస్‌క్రీమ్‌లో మనిషి వేలు

- ముంబై వైద్యుడికి ఊహించని అనుభవం
- ఫుడ్ డెలివరీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్
- ఐస్ క్రీమ్ తింటుండగా వేలు లభ్యం
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



2

## ముందుంది మీ ముసళ్ల పండుగ

- కేసీఆర్‌కు ఈడీ నోటీసులు వచ్చాయి
- కేసు రిజిస్టర్ కూడా అయ్యింది
- మెదక్‌లో బీఆర్ఎస్ రూ. 500 కోట్లు ఖర్చు చేసింది
- ప్రజల గొంతుగా పార్లమెంట్‌లో కొట్లాడుతా
- ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



2

## బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

నలుగురు వ్యక్తులు మృతి ○ మహారాష్ట్రలోని ధామ్నాలో ఘటన



2

# ముందుంది మీ ముసళ్ల పండుగ

**విశ్వంభర, మెదక్:** గొర్రెల స్కామ్‌లో ఈడీ మాజీ ముఖ్యమంత్రికి కేసీఆర్‌కి నోటీసులు ఇచ్చిందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కేసీఆర్ మీద కేసు రిజిస్టర్ అయిందని ఆయన వ్యాఖ్యానించారు. గురువారం మెదక్‌లో జరిగిన విజయోత్సవ ర్యాలీ, సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొద్ది సేపటి క్రితమే తనకు హైదరాబాద్ నుంచి ఫోన్ వచ్చిందని అన్నారు. హరీశ్ రావు, వెంకట్రామిరెడ్డికి కూడా ముందుంది ముసళ్ల పండుగ అంటూ కామెంట్ చేశారు. పైసలు, మందు ఓపెన్‌గా పంచినోళ్లు ఓడిపోయారని అన్నారు. వెంకట్రామిరెడ్డి వెయ్యి కోట్లు పెడితే వాటిని లెక్కచేయకుండా గెలిచానని రఘునందన్ రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాకలో దెబ్బ కొట్టిన అని ఆరడుగుల హరీశ్ ఎగిరిండని, ఇప్పుడు ఎక్కడికి పోయిండని ప్రశ్నించారు. తన గెలుపు కోసం చాలా మంది కష్టపడ్డారన్నారు. ప్రజల గొంతుకగా పార్లమెంట్‌లో కొట్లాడుతానని చెప్పారు. రబ్బరు చెప్పులతో తిరిగి బీజేపీ శ్రేణులు కష్టపడ్డారన్నారు. పార్లమెంట్‌లో గొప్ప నేతల పక్కన కూర్చునే అవకాశం కల్పించారన్నారు. మెదక్లో ర్యాక్ పాయింట్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో మారుమూల బొప్పాపూర్ గ్రామం నుంచి ఢిల్లీకి పోయానని అన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే ఆత్మ విశ్వాసం ఉండాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్యాడర్ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యుద్ధం మొదలు పెట్టగా గెలిచేవరకు ఒదిలిపెట్టొద్దని హితవు పలికారు. జనం గుండెల్లో ఉన్నాం కాబట్టి గెలిచామన్నారు. ఆత్మవిశ్వాసం ఉంటే ఈజీగా గెలువొచ్చన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పనిచేయాలని సూచించారు. చాయి అమ్మిన నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని అయ్యారన్నారు. మోడీ 200 సభలు పెట్టిండని, లీడర్ కావాలంటే పట్టుదల కావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు చెప్పారు.





# సీఎం రేవంత్ రెడ్డితో జపాన్ రాయబారి భేటీ

## రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చ

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జపాన్ రాయబారి సుజుకి హిరోషి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతారంగాలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. జపాన్ రాయబారి మర్యాదపూర్వకంగా తనను కలిసినట్లు పేర్కొన్నారు.



**కమ్మ సామాజికవర్గ ప్రతినిధులు భేటీ**

అంతకుముందు, తెలంగాణ కమ్మ సామాజికవర్గం ప్రతినిధులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. కమ్మ కార్పోరేషన్ ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, తమ సామాజికవర్గ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం ఇచ్చారు. కమ్మ సామాజిక వర్గ ప్రతినిధుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# చంద్రబాబును చూసి నేర్చుకో

- పుసకాల్లో కేసీఆర్ పేరుంటే తప్పేంటి?
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి సబిత ఫైర్
- ఇప్పటికైనా హుందాగా ప్రవర్తించండి
- పాలన మీద దృష్టి పెట్టండి
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరుంటే తప్పేంటని మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంలో జగన్ బొమ్మలతో కూడిన కిట్లను పిల్లలకు యథావిధిగా పంపిణీ చేయాలని, ప్రజాధనం వృధా చేయొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ సీఎం చంద్రబాబు హుందాగా వ్యవహరించారు. ఆయనను చూసి నేర్చుకోవాలని రేవంత్‌కు సబిత చురకలంటించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలుగు పాఠ్య పుస్తకాల్లో కేసీఆర్ పేరు ఉండడంతో ఆ పుస్తకాలను తిరిగి తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై సబిత స్పందించారు.

కేసీఆర్ ఫొటో, కేసీఆర్ గుర్తు తొలగించాలనే ఆలోచనను పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలని రేవంత్‌కు సబిత సూచించారు. ఆరు నెలలైనా ఈ ప్రభుత్వం పాలనపై దృష్టి సారించలేదు అనడానికి ఈ వ్యవహారమే ప్రత్యేక నిదర్శనం. తమిళనాడులో స్టాలిన్ ముఖ్యమంత్రి కాగానే జయలలిత ఫొటోతో ఉన్న బుక్స్, బ్యాగ్స్‌ను యథావిధిగా విద్యార్థులకు ఇచ్చి తమ హుందాతనాన్ని చాటుకున్నారు. పక్క రాష్ట్రం సీఎం చంద్రబాబు.. జగన్ బొమ్మతో గల కిట్లను పంపిణీ చేయాలని, ప్రజా ధనం వృధా చేయకండని ఆదేశించి ఎంతో హుందాగా వ్యవహరించారు. మరి మీ హుందాతనం ఎక్కడికి పోయింది..? అని రేవంత్‌ను నిలదీశారు. విద్యార్థులకు ఇచ్చిన బుక్స్‌లో కేసీఆర్ పేరు ఉందని, బుక్స్ వెనక్కి తెప్పించడం, ఆ పేజీలను చింపేయడం, ఆ పేజీలపై మరో పేజీ అతికించడం సమంజసమా..? ఈ అనాలోచిత చర్యల వల్ల ప్రజాధనం వృధా కాదా..? చింపేసిన పేజీల వెనుకాల వందేమాతరం, జనగణమన గేయాలు, ప్రతిజ్ఞలు ఉన్న పట్టింపు లేదా..? కేసీఆర్ మీద కోపంతో జాతీయ గీతాన్ని కూడా అవమానిస్తారా..? ఈ ప్రభుత్వానికి ఇది తగునా..? అని సబిత ప్రశ్నించారు.

తాము పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ ఆలస్యంగా అందించే సంస్కృతికి ముగింపు పలికి, ఆరు నెలల ముందు నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లి వాటిని విద్యార్థులకు అందించే ప్రయత్నం చేశామని సబిత గుర్తు చేశారు. తాము ఏటా 23 లక్షల మంది విద్యార్థులకు రూ. 108 కోట్లు వెచ్చించి రెండు జతల యూనిఫామ్స్, రూ. 200 కోట్లు వెచ్చించి 1.90 కోట్ల ఉచిత పుస్తకాలను ముద్రించి సకాలంలో అందించామన్నారు. ఇక రాష్ట్రంలో తొలిసారిగా ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ. 34.70 కోట్లతో 11.27 లక్షల మందికి వర్క్ బుక్స్, రూ. 56.24 కోట్లతో 12.30 కోట్ల ఉచిత నోట్ బుక్స్ పంపిణీకి శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. విద్యార్థులందరికీ తాము జూన్ 12వ తేదీనే యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశాం. ఈ ఏడాది బుక్స్‌తో పాటు బ్యాగ్స్ ఇవ్వమని కేసీఆర్ ఆదేశంతో విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పటికైనా హుందాగా ప్రవర్తించండి. పాలన మీద దృష్టి పెట్టమని ఈ ప్రభుత్వానికి సలహా ఇస్తున్నాను అని సబిత పేర్కొన్నారు.

# రేవంత్ మరో ముందడుగు

**(మొదటి పేజీ తరువాయి)**

క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇప్పటికే అన్న క్యాంటీన్ల పేరుతో కేరళలో, దీదీ కా రసోయ్ అనే పేరుతో బెంగాల్‌లో నడుస్తున్న క్యాంటీన్‌ల పనితీరుపై అధ్యయనం చేసినట్లు వివరించారు. రానున్న రెండేళ్లలో కనీసం 150 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఈ క్యాంటీన్ ల నిర్వహణను గ్రామైక్య సంఘాలకు అప్పగించనున్నట్టు తెలిపారు. క్యాంటీన్ నిర్వహణపై ఈ సంఘాలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నట్టు శాంతికుమారి చెప్పారు. ఈ క్యాంటీన్ ల పనితీరు, నిర్వహణ, వీటి ఏర్పాటుకు ఎంత విస్తీర్ణంలో స్థలం అవసరం, వీటి ఏర్పాటుకు రోడ్ మ్యాప్ తదితర అంశాలపై సవివరంగా ప్రణాళికను రూపొందించాల్సింగా గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ కమిషనర్‌ను సీఎస్ శాంతకుమారి ఆదేశించారు. భేటీలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనిత రామచంద్రన్, ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, టూరిజం శాఖ డైరెక్టర్ నిఖిల, టూరిజం కార్పొరేషన్ ఎండీ రమేష్‌నాయుడు, తదితరులు హాజరయ్యారు.

# కోన్ ఐస్‌క్రీమ్‌లో మనిషి వేలు

**విశ్వంభర, ముంబై:** ముంబైకి చెందిన ఓ వైద్యుడికి ఊహించని అనుభవం ఎదురైంది. ఐస్ క్రీమ్ ఆర్డర్ చేస్తే అందులో మనిషి వేలు వచ్చింది. ఈ ఘటనపై అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముంబైలోని మలాడ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఓ యువ వైద్యుడు ఓర్లెమ్ బ్రెండన్ సెర్రావోకి ఐస్‌క్రీమ్ తినాలనిపించింది. దీంతో వెంటనే తన ఫోన్ తీసుకుని ఫుడ్ డెలివరీ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఐస్ క్రీమ్ ఆర్డర్ పెట్టేశాడు. యుమ్మో ఐస్ క్రీమ్స్ షాప్‌నుంచి మూడు యుమ్మో ఫ్లేవర్డ్ బటర్‌స్కోచ్ కోన్ ఐస్‌క్రీమ్‌ను ఆర్డర్ పెట్టాడు. నిమిషాల్లో ఐస్ క్రీమ్స్ కూడా ఇంటికి డెలివరీ అయ్యాయి. ఎంతో ఆశతో దాన్ని తీసుకుని తినడం మొదలు పెట్టాడు. ఇంతలో నాలుకకు ఏదో గట్టి పదార్థం తగులుతున్నట్లు అనిపించింది. అది ఏదైనా నట్ లేదా చాక్లెట్ ముక్క కావొచ్చని ముందుగా భావించాడు. కానీ, అనుమానం వచ్చి ఐస్‌క్రీమ్‌ను పరిశీలించగా.. 2 అంగుళాల మనిషి వేలు కనిపించింది. దీంతో అతడు ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు. వెంటనే మలాడ్‌లోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. వైద్యుడి ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులా?



**విశ్వంభర, హైదరాబాద్:** పగ ప్రతీకార రాజకీయాల కుయుక్తులకు పరాకాష్టగా సీఎం రేవంత్ రెడ్డి పాలన మారిందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. ఆయన పాలన చాలా అధ్వాన్నంగా ఉందని విమర్శించారు. విద్యుత్ లోటుతో సతమతమవుతున్న రాష్ట్రానికి మిగులు విద్యుత్ అందించి వెలుగులు విరజిమ్మే తెలంగాణగా తీర్చిదిద్దినందుకు కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులు ఇస్తారా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపినందుకు కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులా అని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ప్రతి ఇంటికి, ప్రతి పరిశ్రమకు నిరంతర విద్యుత్ సరఫరా చేసి, అభివృద్ధికి దారితీసినందుకు కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులా అని నిలదీశారు. ప్రతీకార రాజకీయాలను పక్కనబెట్టి, ప్రజాసంక్షేమం కోసం కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. గత ప్రభుత్వంలో మాదిరిగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని ప్రజలను డిమాండ్ చేస్తున్నారని దాసోజు శ్రవణ్ తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, అభివృద్ధిని అడ్డుకునే మీ దుష్ప్రయత్నాలను విరమించాలని సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో వెలుగులు విరజిమ్మిన రాష్ట్రం, కరెంట్ లోటుతో సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితిని మీ ప్రతీకార రాజకీయాలతో మరింత కష్టతరం చేయడం సరికాదని హితవు పలికారు. హామీల అమలు చేతకాని గుంపు మేస్త్రీగా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ సంజాయిషీల ప్రతీకార రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. రుణ మాఫీ, రైతు భరోసా, ఉద్యోగాలు, 4 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, మహిళకు 2500 రూపాయలు లాంటి పథకాలు అమలు చేయడం చేతగాక.. కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ కుయుక్తులను పక్కనపెట్టి రాష్ట్రాభివృద్ధి కోసం, సంక్షేమం కోసం ఆలోచనలు, కృషిని కేంద్రీకరించాలని సూచించారు. మీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ఆకాంక్షలను, వారి అభివృద్ధిని అణగదొక్కే ప్రయత్నాలను విరమించాలని హితవు పలికారు.

# బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

**విశ్వంభర, మహారాష్ట్ర:** మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నాగ్‌పూర్ లోని ధామ్నాలో గల బాణాసంచా తయారీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా మరో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై నాగ్‌పూర్ పోలీస్ కమిషనర్ రవీందర్ సింఘాల్ మాట్లాడుతూ.. పేలుడు ఘటనలో నలుగురు మహిళలు సహా మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# గోవధ జరగకుండా చూడాలి

## పోలీసులకు హైకోర్టు ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** బక్రీద్ సందర్భంగా గోవధలు జరగకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు (గురువారం) ఆదేశాలు జారీ చేసింది. గోవధలు జరగకుండా చూడాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా... ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమంగా గోవులను చంపితే చర్యలు తప్పవని హైకోర్టు స్పష్టం చేసింది. ఆవులను తరలించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని తెలిపింది. జంతు వధ చట్టాన్ని అమలు చేస్తున్నామని... మూడు కమిషనరేట్ల పరిధిలో 150 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. గోవుల తరలింపుపై ఇప్పటికే 60 కేసులు నమోదు చేశామన్నారు.

# నోరెత్తరేం!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రాజెక్టుల విషయంలో బయటపడిన లోపాలు, పిల్లర్లు కుంగుబాటుతో ప్రాజెక్టుల నిర్మాణంలోని డొల్లతనం బయటపడింది. అప్పటినుండి ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ నేతలు పదేపదే ఆరోపణలతో రెచ్చిపోయారు. విచిత్రం ఏమిటంటే లోపాలు బయటపడిన దగ్గర నుండి కేసీఆర్, హరీష్ ఎన్నికలు అయిపోయేంత వరకు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అంటే ఇపుడు కూడా మాట్లాడటం లేదు కాని అంత ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగిపోకుండా ఉంటాయా అనే అడ్డగోలు వాదనలు కేసీయార్ వినిపించటమే విచిత్ర మనిపించింది. అసలు ఒక పిల్లరైనా ఎందుకు కుంగాలి అని అనుకోవాల్సిన కేసీయార్ వందలాది పిల్లర్లలో రెండు కుంగిపోవటం సహజమే అని సమర్ధించుకోవటమే ఆశ్చర్యమేసింది.

**కాళేశ్వరం, మేడిగడ్డపై నోరెత్తటంలేదు..!**

హరీష్ అయితే ఇప్పటికీ కాళేశ్వరం, మేడిగడ్డపై నోరెత్తటంలేదు. ఈ నేపధ్యంలోనే జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ తొందరలోనే హరీష్ తో పాటు కేసీఆర్ కు కూడా నోటీసులు ఇవ్వటం ఖాయం. అప్పుడు కమిషన్ ముందు విచారణకు హాజరైనపుడు ఏమి సమాధానాలు చెబుతారన్న విషయం ఆసక్తిగా మారింది. ప్రాజెక్టుల్లో లోపాలను కప్పిపుచ్చుకోవడం, మీడియాలో ఎక్కడా వార్తలు, కథనాలు రాకుండా చూసుకోవడం, ప్రతిపక్షాలపై విరుచుకుపడినట్లు విచారణకు హాజరైనప్పుడు మాట్లాడటం కుదరదు. ఎందుకంటే ఇప్పటికే ప్రాజెక్టుల్లోని డొల్లతనాన్ని కేంద్ర జలవనరుల శాఖలోని కీలకమైన విభాగమైన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బయటపెట్టేసింది. కుంగింది 2 పిల్లర్లు కాదని చాలా పిల్లర్లు దెబ్బతిన్నట్లు అథారిటి ప్రకటించింది. అంతేకాకుండా ప్రాజెక్టు లోపల భాగంలో చాలాచోట్ల పెద్ద పెద్ద బొక్కలున్నట్లు కూడా చెప్పింది. అధికారంలో ఉన్నాము కాబట్టి ఏమి చేసినా చెల్లిపోతుందని ఇష్టారాజ్యంగా చేసుకుపోతే అధికారంలో నుండి దిగిపోయిన తర్వాత ఏమి జరుగుతుందో జనాలందరికీ తెలుస్తుంది. జస్టిస్ కమిషన్ బహుశా జూన్ చివరలో కాని జూలై మొదటి వారంలో కాని ముందుగా హరీష్‌కు నోటీసులు ఇవ్వబోతోందని సమాచారం. కమిషన్ విచారణకు హాజరైనప్పుడు హరీష్ ఏం చెబుతారన్నది ఆసక్తిగా ఉంది.

# నా జీవితంలో మొదటి అవకాశం

**విశ్వంభర, హైదరాబాద్:** ఇక నుంచి తీన్మార్ మల్లన్నలో కొత్త యాంగిల్ చూస్తారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఉమ్మడి వరంగల్ ,ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన గురువారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఛాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌లో ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ, బల్మూరి వెంకట్ , పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడారు. శాసన మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడం నా జీవితంలో మొదటి అవకాశం అన్నారు. ఇంతకు ముందు నేను వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదని, ఇంతకు ముందు తీన్మార్ మల్లన్న వేరు, ఇప్పుడు ఉన్న తీన్మార్ మల్లన్న వేరని, ఇప్పటి నుండి బాధ్యత గల వ్యక్తిగా నడుచుకుంటానన్నారు. పట్టభద్రుడిగా నాకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దీపా దాస్ మున్షీ, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇండియా కూటమి సభ్యులకు హృదయ పూర్వక ధన్యవాదాలు చెప్పారు. నా గెలుపు ను భుజాల మీద వేసుకున్న నా టీంకు ఎల్లప్పుడూ రుణాలు పడి ఉంటానని ఎమ్మెల్సీ మల్లన్న చెప్పారు.

# ఈ విజయం అమరవీరులకు అంకితం

విశ్వంభర, హైదరాబాద్: మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్ కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. నవీన్ కుమార్‌తో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ చేయించారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్ రెడ్డి, అజేయుడు ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్ మీడియాతో మాట్లాడారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అమరవీరులకు తన విజయాన్ని అంకితం చేస్తున్నాని వెల్లడించారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన స్థానిక సంస్థల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో తనను గెలిపించి పాలమూరు కేసీఆర్ అడ్డా అని ప్రజలు మరోమారు నిరూపించారన్నారు. నవీన్ కుమార్‌రెడ్డి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో జరిగిన ఉపఎన్నికలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ అభ్యర్థిగా నవీన్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ నెల 2న వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థిపై మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘన విజయం సాధించారు.





## జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోవల్

**మూడవసారి నియామకం**

**విశ్వంభర, ఢిల్లీ:** అజిత్ దోవల్ మళ్లీ జాతీయ భద్రతా సలహాదారుగా నియమితులయ్యారు. మూడవసారి ఆయన ఆ పదవిని చేపట్టనున్నారు. ఇక ప్రధాన మంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీగా డాక్టర్ పీకే మిశ్రాను నియమించారు. ఈనెల 10వ తేదీ నుంచి ఆ నియామకం అమలులోకి రానున్నట్లు అపాయింట్స్ కమిటీ తెలిపింది. పదవీకాలం సమయంలో పీకే మిశ్రాకు క్యాబినెట్ మంత్రి హోదా ర్యాంక్ ఇవ్వనున్నారు. ప్రధాని మోడీకి సలహాదారులుగా అమిత్ ఖేర్, తరుణ్ కపూర్‌లను నియమించారు. రెండేళ్ల కాలపరిమితి కోసం ఆ ఇద్దరిని నియమించారు.

## బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

**నలుగురు వ్యక్తులు మృతి.. మహారాష్ట్రలోని ధామ్నాలో ఘటన**



**విశ్వంభర, మహారాష్ట్ర:** మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నాగ్‌పూర్ లోని ధామ్నాలో గల బాణాసంచా తయారీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా మరో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై నాగ్‌పూర్ పోలీస్ కమిషనర్ రవీందర్ సింఘాల్ మాట్లాడుతూ.. పేలుడు ఘటనలో నలుగురు మహిళలు సహా మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## త్వరలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్!

**ఒక్కో జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించే చాన్స్**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారట. త్వరలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ వెళ్లానున్నారట. జిల్లా స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సీఎం రేవంత్ త్వరలో జిల్లాల్లో పర్యటించనున్నారు. ఒక్కో జిల్లాలో ఒకటి లేదా రెండు రోజులపాటు పర్యటించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నేతలను సిద్ధం చేసేందుకు ఈ టూర్ ఉపయోగపడుతుందని ఆయన భావిస్తున్నారట. అలాగే సంక్షేమ పథకాల అమలు, అధికారుల పనితీరు గురించి తెలుసుకోవచ్చని యోచిస్తున్నట్లు సమాచారం. అటు ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రుణమాఫీ అమలుపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే విధివిధానాల ఖరారుకు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ నెల 15వ తేదీ లేదా 18వ తేదీన సమావేశం జరిగే అవకాశం ఉంది. రుణమాఫీ అమలుకు అవసరమైన ప్రభుత్వపరమైన నిర్ణయాలపై సమావేశంలో చర్చించి వెల్లడించనున్నట్లు సమాచారం.

## సీఎం ముఖ్య కార్యదర్శిగా రవిచంద్ర బాధ్యతలు స్వీకారం

**విశ్వంభర, విజయవాడ:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య కార్యదర్శిగా ముద్దాడ రవిచంద్ర గురువారం సచివాలయం మొదటి బ్లాకులో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం పలువురు అధికారులు, సిబ్బంది రవిచంద్రకు పుచ్ఛగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు టిఆర్అండ్బి ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న, గుంటురు జిల్లా కలెక్టర్ యం.వేణు గోపాల్ రెడ్డి, ఎస్పి తుషార్ గూడి, న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకర్, ప్రోటోకాల్ డైరక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, సచివాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ సంస్థ

- ఒలంపస్ కార్పొరేషన్ ఓడీసీ ఏర్పాటు
- ఒలంపస్‌కు ప్రభుత్వం సహాయం అందిస్తుంది
- మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, న్యూయార్క్:** హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరనుంది. మెడికల్ టెక్నాలజీలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థగా పేరొందిన ఒలంపస్ కార్పొరేషన్ హైదరాబాద్‌లో తన ఆర్ అండ్ డీ ఆఫ్ షోర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఓడీసీ) ఏర్పాటు చేయనుంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థతో కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా ఒలంపస్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట రెడ్డి సమక్షంలో ఒలంపస్ కార్పొరేషన్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆర్ అండ్ డీ) సయ్యద్ నవీద్ ఈ విషయం ప్రకటించారు. ఈ మేరకు శ్రీధర్ బాబు ట్వీట్ చేశారు. గురువారం న్యూయార్క్‌లో ఒలంపస్ కార్పొరేషన్‌ను కలవడం ఆనందంగా ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. ఒలంపస్ కార్పొరేషన్ తన ఓడీసీని ఏర్పాటు చేయడం. తెలంగాణ, హైదరాబాద్‌లకు ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ఒలంపస్‌కు ప్రభుత్వం తన పూర్తి సహాయాన్ని అందజేస్తుందని హామీ ఇచ్చినట్లు శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సంస్థ ఏర్పాటుకు తెలంగాణను ఎంచుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒలంపస్ ఏర్పాటు చేయటం ద్వారా.. స్థానిక ప్రతిభకు అపారమైన అవకాశాలు వస్తాయని శ్రీధర్ బాబు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో పని చేయడానికి.. వైద్య సాంకేతికతలో ప్రపంచ ఆవిష్కరణలకు దోహదపడే వేదికను అందిస్తుందన్నారు. ఈ సంస్థ హైదరాబాద్, తెలంగాణలో పరిశోధన, అభివృద్ధి కోసం మొత్తం పర్యావరణ వ్యవస్థను మెరుగుపరిచి.. మరిన్ని పెట్టుబడులు, సహకారాలను ప్రోత్సహిస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు.



# ఇది సినిమా థియేటరా.. అనుకుంటే పప్పులో కాలేసినట్టే

- పిల్లలకు చదువు చెప్పే బడి.. ఇది నిజం
- పాడుబడిన థియేటర్ ని బడిగా
- మార్చిన గౌతమీ పాఠశాల యాజమాన్యం
- యథేచ్ఛగా అనుమతులు ఇచ్చిన జిల్లా విద్యా శాఖ యంత్రాంగం
- రాజకీయ నాయకుల ప్రమేయం ఉందంటున్న విద్యార్థి సంఘాలు
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి
- నల్గొండ జిల్లా .. గుర్రంపోడు లో దుస్థితి

**విశ్వంభర, నల్గొండ:**

బడి.. గుడి కన్నా గొప్పది అంటారు.. ఇప్పుడు అలాంటి బడి కాస్త పాడుబడిన సినిమా థియేటర్ లో నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న తీరు నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. విద్యాశాఖ అధికారులు నిబంధనలకు నీళ్లు వదులుతూ పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేటు పాఠశాలలకు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. మండల కేంద్రంలో గత సంవత్సరం నుండి గౌతమి ఉన్నత పాఠశాల ప్రారంభం అయ్యింది. యాజమాన్యం అయితే రేకుల షెడ్డులో ఆ విద్యా సంవత్సరాన్ని అరకొర వసతులతో నడిపించారు . ఈ పాఠశాలకు సరైన వసతులు లేకపోవడం, గాలికి లేచిపోయే రేకులతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ, ఆట స్థలం ,ఫైర్ సేఫ్టీ లేకుండానే నల్గొండ జిల్లా విద్యా శాఖ అధికారులను మేనేజ్ చేస్తూ వచ్చారు. అప్పటికే పలు విద్యార్థి సంఘాలు ఉన్నతాధికారులకు విన్నవించినా విద్యా శాఖ అధికారులు ఇప్పటికీ నిర్లక్ష్యం వహిస్తూ వస్తూనే ఉన్నారని మండి పడ్డారు. ఈ సంవత్సరం నూతన బిల్డింగ్ కోసం ఏకంగా సినిమా థియేటర్ నే వాడేస్తున్నారు. బడి పిల్లల భవిష్యత్తుకు మార్గం చూపే దేవాలయాలు, బడులు.. ఇప్పుడు అలాంటి బడులని ఏకంగా పాడుబడిన థియేటర్ లలో నిర్వహించడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. సరైన బిల్డింగ్ నిర్మాణం , గదుల ఏర్పాటు , ఒక పాఠశాల నడిపించాలంటే విద్యా శాఖ నిబంధనలు, అనుమతులను పరిగణనలోకి తీసుకోకుండా, డబ్బులతో ఏదైనా చేయగలం అనుకునే యాజమాన్యాలు, మరో వైపు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోకుండా విద్యా వ్యవస్థకు ఇలాంటి అనుమతులను ఇవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవో నెంబర్ వన్ ను తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులు.. యాజమాన్యం ఇచ్చే కాసులకు కక్కుర్తి పడ్డారని పిల్లల తల్లితండ్రులు భావిస్తున్నారు. ఇలాంటి చర్యలపై వెంటనే తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం స్పందించి పిల్లల భవిష్యత్తును కాపాడాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

# జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు..

**పరిస్థితులపై ప్రధాని మోదీ సమీక్ష**



**విశ్వంభర, జమ్మూ కశ్మీర్:** జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. గత నాలుగు రోజుల్లోనే నాలుగు దాడులకు పాల్పడ్డారు. జూన్ 9న రియాసిలో బస్సుపై మొదటి సారి దాడి జరిగింది. తర్వాత మరో మూడు దాడులు చేశారు. కథువా జిల్లా హీరానగర్‌లోని సైదా సుఖల్ గ్రామంలో ఓ ఇంటిపై దాడి చేశారు. ఇందులో ఇద్దరు ఉగ్రవాదులు, ఒక జవాన్ మరణించారు. తర్వాత దోడాలని ఛత్తర్ గాలాలోని నాలుగు రాష్ట్రీయ రైఫిల్స్, పోలీసుల జాయింట్ చెక్ పోస్టుపై అటాక్ చేశారు. ఇందులో ఐదుగురు సిబ్బంది, ఒక పోలీసు అధికారి గాయపడ్డారు. ఇటీవల యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు.

**ప్రధాని సమీక్ష..**

జమ్మూకశ్మీర్‌లోని భద్రత పరిస్థితులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమీక్షించారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్, జమ్మూ కశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హాలతో మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లో భద్రత పరిస్థితులు, ఉగ్ర వ్యతిరేక కార్యాకలాపాలపై వంటి వివరాలను ప్రధాని తెలుసుకున్నారు. ఈ మేరకు ఉగ్ర నిరోధక సామర్థ్యాలను పూర్తిస్థాయిలో రంగంలోకి తీసుకురావాలని ప్రధాని ఆదేశించినట్లు సమాచారం.

**శాంతిభద్రతలకు విఘాతం**

జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నట్లు డీజీపీ ఆర్ఆర్ స్వైన్ ఆరోపించారు. అయితే ఇప్పటికే రంగంలోకి దిగిన ఎన్ఐఏ..స్థానిక పోలీసులతో కలిసి దర్యాప్తు మొదలుపెట్టింది. ఆర్మీ, సీఆర్పీఎఫ్,స్థానిక పోలీసులతో కలిసి ఆపరేషన్ సైతం చేపట్టాయి. కాగా, రియాసీ జిల్లాలో భద్రత పరిస్థితులపై డీజీపీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది.

## వాలంటీర్ వ్యవస్థ ఇంకా రద్దు కాలే

**త్వరలోనే దీనిపై సమీక్ష నిర్వహిస్తాం**

**మంత్రి నిమ్మల రామానాయుడు**



**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ఒకసారి, వారిని తొలగిస్తామని మరొకరు రకరకాలుగా ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే మంత్రి నిమ్మల రామానాయుడు వాలంటీర్ వ్యవస్థపై స్పందించారు. రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థ ఇంకా రద్దు కాలేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో తాత్కాలికంగా వారిని విధుల నుంచి దూరం పెట్టినట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే వాలంటీర్ వ్యవస్థపై సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వాలంటీర్లను ఏ విధంగా ఉపయోగించుకోవాలో అనే అంశాన్ని చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని గ్రామాలు, పట్టణాల్లో వాలంటీర్లను నియమించి వారి ద్వారా పెన్షన్లు ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వాలంటీర్లపై టీడీపీ వ్యతిరేకిస్తూ వచ్చింది. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే చర్చ మొదలైంది.

## భారత ఎన్నికలపై వ్యాఖ్యలు చెయ్యబోం: పాకిస్థాన్



**విశ్వంభర, పాకిస్తాన్:** భారత్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై తాము ఎటువంటి వ్యాఖ్యలు చేయబోమంటూ పాకిస్థాన్ పేర్కొన్నది. అదేవిధంగా భారత అంతర్గత వ్యవహారాలపైనా కూడా స్పందించబోమంటూ పాక్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ ఓ మీడియా సమావేశంలో తెలిపారు. భారత్‌లో జరిగిన ఎన్నికల గురించి మీడియా ప్రతినిధులు స్పందన కోరగా ముంతాజ్ జహ్రా మాట్లాడుతూ.. 'భారత్ లో ఇటీవల ముగిసిన ఎన్నికలకు సంబంధించి, లేదా.. ఆ దేశ అంతర్గత వ్యవహారాల గురించి ఎటువంటి వ్యాఖ్యలు చేయదలచుకోలేదు' అంటూ బదులిచ్చారు. మోదీ విజయంపై ఇరు దేశాల ప్రధానుల మధ్య లేఖల మార్పిడి జరగలేదని, కానీ.. మోదీ ప్రమాణ స్వీకారం తరువాత ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోషల్ మీడియాలో (ఎక్స్) ఓ ట్వీట్ చేశారని గుర్తు చేశారు. కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలను అభినందించడమనేది ఆనవాయితీ అంటూ ఆమె పేర్కొన్నారు. 'ప్రధాని షరీఫ్ ఈ మేరకు స్పందించారు.. అటు మోదీ కూడా బదులిచ్చారు.. ఈ విషయంలో ఇంతకంటే ఎక్కువ వివరణ ఇవ్వదల్చుకోలేదు' అంటూ బలోచ్ బదులిచ్చారు. అయితే, భారత ప్రధానిగా వరుసగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన మోదీకి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆయన సోదరుడు, అధికార పీఎంఎల్ఎన్ అధినేత నవాజ్ షరీఫ్ లు సోషల్ మీడియా (ఎక్స్) వేదికగా శుభాకాంక్షలు తెలియజేసిన విషయం తెలిసిందే. కాగా, మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి ఏడు పొరుగు దేశాలకు ఆహ్వానం పంపించారు. కానీ, ఇస్లామాబాద్ కు మాత్రం భారత్ ఆహ్వానం పంలేదు. దీంతో దాయాది దేశం ఈ కార్యక్రమానికి రాలేదు.

# రక్త దానం ఆరోగ్యానికి ప్రయోజనకరం

## జూన్ 14... రక్త దాతల దినోత్సవం




> అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టు మిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. ఏ, బీ, ఓ, బ్లడ్ గ్రూపులను కనుగొన్న కార్ల్ లేండ్ స్టీనర్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజైన జూన్ 14న "ప్రపంచ రక్త దాతల దినోత్సవం"ను ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో జరుపుకుంటారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపేందుకు, సురక్షితమైన రక్తం యొక్క ఆవశ్యకతను తెలియజేసేందుకు, రక్తదాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచే విధానాలను మెరుగు పరచు కునేందుకు 2005లో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా రక్తం అంటే ఏమిటి.. రక్తదానం ఎలా చేయాలి.. ఎవరు రక్త దానానికి అర్హులు.. రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం.. రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకురారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడు తుంటారు. అయితే దీనిపై ప్రతీ ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు.

కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. అవి A, B, AB, O అనే వర్గాలుగా విభజించాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగిటివ్, పాజిటివ్‌గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు.

శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించా లనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండుగడ్డి రంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని "ప్లాస్మా" అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవుతుంటాయి.

అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలా ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని "గ్రహీత" అని, ఇచ్చే వ్యక్తిని "దాత" అని అంటారు. O గ్రూప్ రక్తం కలిగిన వారిని "విశ్వదాత" అని, AB. గ్రూపుల రక్తం కలిగినవారిని "విశ్వ గ్రహీత" అని అంటారు.

తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయస్సు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు.. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 34 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35 నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ అనే ఈ మూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు.

రక్తం అవసరమైనవారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం. శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హాని చేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవడానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది.



ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే లభ్యమవుతుంది. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. రక్తదానం చేయడమంటే ఓ ప్రాణాన్ని కాపాడడమే. ప్రతీ రెండు సెకన్లకు దేశంలో ఎక్కడోచోట ఒకరికి రక్తం అవసరమవుతుంది. ప్రతి రోజూ కనీసం 38,000 మంది రక్తదాతల అవసరం ఉంది. అత్యధికంగా కోరుకునే రక్తం "ఓ" గ్రూప్ దేశంలో ఏటా కొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్ బాధితులుగా తేలుతున్నారు. కీమో థెరపీ చికిత్స సందర్భంగా తరచూ వారికి రక్తం అవసరం ఉంటుంది.

రక్తదాన ప్రక్రియ పావుగంటలో పూర్తవుతుంది. మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, సుమారుగా 1 యూనిట్ రక్తాన్ని దానం చేయవచ్చు. దాని వల్ల దాత శరీరానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆరోగ్య వంతుడైన దాత ప్రతీ 56 రోజులకు ఒకసారి ఎర్ర రక్తకణాలను డొనేట్ చేయవచ్చు. ఆరోగ్యవంతుడైన దాత కనీసం 7 రోజుల విరామంతో సంవత్సరానికి 24 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేయవచ్చు. రక్తం కోసం ప్రతీరోజు ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. తలసేమియా లాంటి డేంజర్ వ్యాధిగ్రస్తులకైతే ప్రతి 15 రోజుల కోసారి బ్లడ్ ఎక్కించక పోతే బతకడం కష్టం. కనుక ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, సాటి మనుషులను బతికించుకుందాం.

- రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494

### ఎవరు ఎవరికి రక్తం దానం చేయవచ్చు

రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగపడుతుంది. ఎవరు ఎవరికి రక్తం దానం చేయవచ్చంటే.. AB గ్రూప్ వారు AB గ్రూప్ కి, A గ్రూప్ వారు , AB గ్రూపుల వారికి కి, B గ్రూప్ వారు B, AB గ్రూపుల వారికి, O గ్రూప్ వారు A,B, AB, O గ్రూప్‌ల వారందరికి దానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే AB గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. B గ్రూప్ వారు B, O గ్రూపుల వారి నుంచి, A గ్రూప్ వారు A, O గ్రూపుల వారి నుంచి, O గ్రూప్ వారు O గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి.

## పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్న

# పిల్లలపై తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఈ కాలం పిల్లలు నూతన పోకడలకు అది తొందరగా అలవాటు పడడం ఒక ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ కాలం అమ్మాయిలపై సినిమాలు, ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్‌ల ప్రభావం చాలా ఎక్కువగా వుంది. దీంతో వాళ్లు సులువుగా ఆకర్షణలకు లోనవుతున్నారు. వారి బలహీనతను ఆసరా చేసుకుని వారిపై యువకులు ప్రేమ వల విసురుతున్నారంటున్నారు నిపుణులు. చాలా సందర్భాల్లో పిల్లలు ప్రేమలో పడిన విషయాన్ని ఎవరో చెబితే మాత్రమే తల్లిదండ్రులకు తెలుస్తున్నది. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు సన్నిహితంగా గమనించే తీరిక లేకపోవడమే ఈ విపత్తుకు ప్రధాన కారణం అంటున్నారు. మరో వ్యక్తితో గాఢమైన అనుబంధం ఏర్పడినప్పుడు పిల్లలు స్నేహితులను దూరం పెడతారు. సన్నిహితంగా వుండే వ్యక్తి ఒకటి రెండు రోజులు కనిపించకపోతే తీవ్ర వేదన చెందుతారు. ఇలాంటి అంశాలను తల్లిదండ్రులు గమనించాలి. వారి మనసుకు చేరువయ్యేందుకు ప్రయత్నించాలి. తల్లి లేదా తండ్రి ఎవరో ఒకరు నిత్యం వాళ్లతో ప్రేమగా కొద్దిసేపయినా తప్పక మాట్లాడాలి. వాళ్ల చదువుల గురించి మాత్రమే కాదు.. వాళ్ల ఆలోచనల మీద కూడా తల్లిదండ్రులు పట్టించుకోవాలి. అప్పుడే పిల్లల భవిత నిజంగా బంగారు బాట అవుతుంది.

ఎవరి పిల్లలు వారికి ఎంతో సంస్కారవంతులు అని ఊహించుకునే లోకంలో తల్లిదండ్రులు ఎప్పుడూ తేలియాడుతూనే ఉన్నారు. కానీ ఈ సాంకేతిక ప్రపంచంలో చదువుల పేరిట కాలేజీల్లో జరుగుతున్న పిల్లల యొక్క ఆలోచనా విధానం ఎటు దిక్కు దారి తీస్తుందో తెలియటం లేదు. కారణం ఏమిటంటే ఆధునిక పోకడలను అలవోక చేసుకోవడంలో సులభతరంగా సాంకేతిక పరిజ్ఞానం తోడయ్యింది. అదేమిటంటే ఉదాహరణకు తీసుకున్నట్లయితే సామాజిక మాధ్యమాల్లో నూతన పోకడలను అలవాటు చేసుకునే విధంగా ప్రేరేపితం చేస్తున్నటువంటి సందేశాలు ప్రధాన కారణంలో ఒకటిగా తీసుకోవచ్చును. మరో విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు అనేటటువంటి సదుద్దేశంతో వారికి ఎంతైనా ఖర్చు పెట్టే స్థితిలో ఉండడం చేసే ప్రయత్నం. ఒక విషయం. వారి చదువుల కోసం పెద్ద మొత్తంలో తమ తమ తల్లిదండ్రులు ఫీజుల రూపంలో మరియు వారికి హాస్టల్ వసతుల విషయంలో కానివ్వండి ఇతర ఎటువంటి విషయాల్లో వెనుకాడకుండా డబ్బులు ఖర్చు పెడుతున్నారు. ఈ తరుణంలో కాలేజీలో హాస్టళ్లలో కొంతమంది పిల్లలు ప్రేమ అనే ఉచ్చులో చక్రబంధంలో చిక్కుకుపోతున్నారు.



సాధారణంగా హైస్కూల్ విద్య తర్వాత ఇంటర్మీడియట్ వరకు పిల్లలు ఒక క్రమశిక్షణలో పెరిగినప్పటికీ అదే ఉన్నత విద్యకోసం ఇంజనీరింగ్ లాంటి కోర్సుల కోసం ఇతర ప్రదేశాల్లో తల్లిదండ్రులకు దూరంగా వారిని కాలేజీలలో చేర్పించడం జరుగుతుంది. అప్పుడు కొంత తల్లిదండ్రుల యొక్క నీడ పిల్లలపై తగ్గుతుంది. ఈ కారణంగా కొంతమంది పిల్లలు వారి యొక్క భవిష్యత్తు అగమ్యగోచకం చేసుకోవడంలో వారికి అవకాశం దొరుకుతుంది. అదేమిటంటే ప్రేమ అనే ఉచ్చులో పడి పిల్లలు వారు తెలియకుండగానే ఒక చక్రబంధంలో చిక్కుకుంటున్నారు. అదెలాగంటే మోసగాళ్లు పిల్లలను బ్లాక్ మెయిల్ చేయడం. సెల్ఫోన్ల ద్వారా వీడియోలు చిత్రీకరించి మళ్లీ వారికి చూపించి భయభ్రాంతులకు గురిచేసి వారిని లోబర్చుకునేందుకు ప్రయత్నాలు చేసిన సంఘటనలు దాదాపుగా మన కళ్ల ముందు రోజుకు అక్కడ ఇక్కడ కనబడుతూనే ఉన్నాయి. వీటన్నింటికి మనం ప్రధాన కారణంగా సూచించాల్సిన విషయం ఏమిటంటే పిల్లలతో తల్లిదండ్రులకు ఉన్న ఇంటరాక్ట్ సరైన విధంగా లేకపోవడం. వారు ఏ విధంగా వారి యొక్క రోజువారి కార్యకలాపాలు జరుగుతున్నవి అనే విషయాన్ని గమనించ లేకపోవడమే ప్రధాన కారణం. పై విషయమై పరిష్కార దిశగా తల్లిదండ్రులు తమ పిల్లలపై చూపించాల్సిన ప్రేమలో భాగంగా గమనించాల్సిన విషయాలు మరెన్నో ఉన్నాయి. ప్రత్యేకంగా ఓ కంట కనిపెడుతూ వారు చదువుకునే విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉన్నది.



-డా. చిటికెన కిరణ్ కుమార్,
రచయిత, విమర్శకులు
ఐ. బి. ఆర్. ఎఫ్. సభ్యులు
సెల్ 9490841284.




# రూ.21,47,48,569

## పేదోడి ఇంటికి వచ్చిన జూన్ నెల కరెంట్ బిల్లు

### వినియోగించుకున్న విద్యుత్ కేవలం 0.60 కిలో వాట్లు

### ఆ గ్రామంలో మరో పది మందికి రూ.కోట్లలో బిల్లు

### నాగర్ కర్నూల్ జిల్లా ఖానాపురం గ్రామంలో వెలుగులోకి..

### విద్యుత్ బిల్లులు చూసి గుడ్లు తేలేసిన గ్రామస్తులు

**విశ్వంభర, నాగర్ కర్నూల్:** శీతాకాలం, వానాకాలం తో పోలిస్తే వేసవికాలం అందరి ఇళ్లలోనూ కరెంటు వినియోగం కొంచెం ఎక్కువగానే ఉంటుందని చెప్పొచ్చు. అందుకే వేసవిలో కరెంటు బిల్లు కూడా ఎక్కువగానే ఉంటుంది. ఒక్కోసారి ఆ రెండు సీజన్స్ తో కంపేర్ చేస్తే వేసవిలో పవర్ బిల్ డబుల్, ట్రిపుల్ కూడా అవుతుండొచ్చు. ఇది సహజమే. అందులోనూ మధ్య తరగతి ఇళ్లలో కరెంటు ఎంత ఎక్కువ వాడినా బిల్లు మహా అయితే రూ.1000 నుంచి రూ.2000 మధ్యలో ఉండొచ్చు. కానీ ఓ గ్రామానికి చెందిన మామూలు మధ్యతరగతి వ్యక్తికి పవర్ బిల్ వేలు కాదు, లక్షలు కాదు, రూ. కోట్లలో కరెంటు బిల్ వచ్చింది. ఇది చూసి అతనికి కరెంటు షాక్ కొట్టినంత పని అయింది.

**వివరాల్లోకి వెళితే...**

తెలంగాణ లోని నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన వేమారెడ్డి అనే వ్యక్తి ఇంటి కరెంటు బిల్లు రూ.21 కోట్లు వచ్చింది. అతని ఇంటి సర్వీస్ నెంబర్ 1110000 51 మీటర్ కేవలం 0.60 కిలో వాట్స్ కి సంబంధించినది. జనవరి 1, 1970 నుంచి జూన్ 5, 2024 వరకు 998 రోజులపాటు 297 యూనిట్ల కరెంటు వాడినందుకు రూ.21,47,48,569 బిల్ వచ్చింది. ఈ బిల్ అతనికి జూన్ ఐదున ఇవ్వడం మరో విశేషం. అయితే కరెంటు బిల్లు దాదాపు రూ.21 కోట్లు రావడంతో ఇంటి యజమాని వేమారెడ్డి ఖంగు తిన్నాడు. అయితే ఇలా వేమారెడ్డికి ఒక్కడికే కాదు ఆ గ్రామంలో మరో పది మందికి రూ.కోట్లలోనే కరెంటు బిల్లు వచ్చిందట. అవగాహన లేని బయటి వ్యక్తులతో లైన్ మెన్, జూనియర్ లైన్ మెన్ విద్యుత్తు బిల్లుల ఇస్తున్నారని, అందుకే ఇలాంటి పొంతన లేని బిల్లులు వస్తున్నాయని వారంతా మండిపడుతున్నారు. ఇక ఎక్కువ బిల్లు వచ్చిన వారంతా స్థానిక విద్యుత్ అధికారిని సంప్రదించగా టెక్నీకల్ సమస్యతో అధిక బిల్లు వచ్చినట్టు చెప్పారట. వారి నుంచి ఫిర్యాదులు తీసుకుని బిల్లులను వెంటనే సవరించినట్లు ఏఈ మహేష్ తెలిపారు.



## మధుయాష్కిని కలిసిన షబ్బీర్ అలీ

**విశ్వంభర, హైదరాబాద్:** టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ , మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించారు.

## పెళ్లి కార్డు పై పవన్ కల్యాణ్ ఫొటో




**విశ్వంభర, ఖమ్మం:** పెళ్లి కార్డు పై పవన్ కల్యాణ్ ఫొటో ముద్రించి వినూత్నంగా ఒక అభిమాని తన అభిమానాన్ని చాటుకున్నాడు. ముదిగొండ మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కుటుంబరావు (భద్ర) అనే వ్యక్తి హీరో, ఏపీ రాజకీయ నాయకుడు అయిన పవన్ కల్యాణ్ పై తన అభిమానం చాటుకున్నాడు. ఈనెల 18న కుటుంబరావు పెళ్లి ఉండగా తన పెళ్లి పత్రికపై జనసేన అధినేత ఫొటో, జనసేన గుర్తుని ముద్రించి ఆశ్చర్యపరుస్తున్నాడు.. అంతే కాకుండా ముదిగొండ మండల జనసేన పార్టీ కో ఆర్డినేటర్ గా జొన్నలగడ్డ కుటుంబరావు (భద్ర) పనిచేస్తూ పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా ఎన్నో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎవరికి రక్తం కావాలన్నా నిత్యం అందుబాటులో ఉంటూ ఇప్పటికీ పదిహేను సార్లకి పైగా రక్త దానం చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం జిల్లాలోనే ఈ పెళ్లి కార్డు వైరల్ గా మారింది.

## డిండి ఎస్ఐను సస్పెండ్ చేయాలి

**దేవరకొండలో సి ఐ నర్సింహులుకి దళిత నాయకులు ఫిర్యాదు**



**విశ్వంభర, డిండి**: ఎర్రగుంటపల్లి మాజీ సర్పంచ్ భర్త పేట వెంకటయ్య ను అసభ్య పదజాలంతో దూషించిన సంఘటనకు సంబంధించి డిండి ఎస్.ఐ రాజు ను సస్పెండ్ చేయాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నర్సింహా, ఎంఆర్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ మాదిగ, డీవై జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎర్ర కృష్ణ జాంభవి డిమాండ్ చేశారు. దేవరకొండ పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో డిండి ఇంచార్జి, సి ఐ నర్సింహులుకి దళిత నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, ఎస్సై రాజు పై శాఖా పరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. లేకుంటే ఎస్సై రాజును సస్పెండ్ చేసే వరకు పోరాటం చేస్తామని, అవసరమైతే పోలీస్ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై పునః పరిశీలన చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పొట్ట మురళి, ఎర్ర యాదగిరి, కొమ్ము రాజశేఖర్,పేట వెంకటయ్య,ఎర్ర నర్సింహా , హరి కృష్ణ,తరి గోవర్ధన్, అందుగుల సైదులు, ఎర్ర బిక్షపతి,నాగిళ్ళ ఆంజనేయులు,వంశీ, ఈశ్వర్, ఇద్దయ్య,నర్సింహా, సైదులు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సహకార సంఘం ఉప ఎన్నికలో ఆత్మకూరు(ఎం)కి వైస్ చైర్మన్ పదవి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు రైతు సహకార సంఘం ఉప ఎన్నికలో ఆత్మకూరు (ఎం)మండలంలోని కప్రాయి పల్లికి చెందిన డైరెకర్ బండ పద్మ ఐలయ్య వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆత్మకూరు(ఎం) మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఎన్నికకు సహకరించిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య , తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెల్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి, పాక్స్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, రహింఖాన్ పేట డైరెక్టర్ తాల్లపల్లి స్వామి (మోత్కూరు పాక్స్), పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, మండల నాయకులు తండ శ్రీశైలం గౌడ్, కట్టెకొల హన్మంతు గౌడ్, భాషబోయిన పాపయ్య యాదవ్, జన్నాయికోడె నగేష్, సామ శ్రీనివాస్ రెడ్డి, కందడి దశరథ రెడ్డి , పోతగాని మల్లేశం, వెంకట్ రెడ్డి, భూపతి ఆనంద్, బండ కృష్ణ, కొంగరి రాజు, బొట్ల అనిల్, కొంగరి యాదయ్య, కొంగరి పరుష రాములు, కొంగరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 15 నాటికి లక్షా ఇరవై వేల ఎకరాలకు

# గోదావరి నీళ్లు

- సీతారామ పేరిట రీ డిజైన్ తో ప్రజాధనం దుర్వినియోగం
- ఎనిమిది వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వని బిఆర్ఎస్ ప్రభుత్వం
- ఎన్కూర్ లింకు కెనాల్కు రాజీవ్ కెనాల్ గా నామకరణం
- మంత్రులతో కలిసి సీతారామ ప్రాజెక్టుపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి
- ఆరు గంటల పాటు సీతారామ ప్రాజెక్టు పనుల పరిశీలన
- కెనాల్ వెంట 63 కి.మీ ప్రయాణం చేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు



**విశ్వంభర, ఖమ్మం:** ఆగస్టు 15 నాటికి ఎన్కూరు లింకు కెనాల్ ను పూర్తి చేసి లక్షా ఇరవై వేల ఎకరాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం గోదావరి నీళ్లను అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారి పల్లి వద్ద ఉన్న సీతారామ హెడ్ రెగ్యులేటరీ పనులను, అక్కడున్న వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. అక్కడి నుంచి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌజ్ 1 వద్దకు చేరుకొని పంప్ హౌజ్ పనులను పరిశీలించిన అనంతరం పవర్ సప్లై ను ప్రారంభించారు. ఆ తర్వాత పంపు హౌజ్ 3 వద్దకు చేరుకొని ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటివరకు జరిగిన ప్రాజెక్టు పనులు, కొనసాగుతున్న కెనాల్స్ పనులు, భూ సేకరణ, ప్రాజెక్టు పూర్తి కావడానికి కావలసిన నిధులు, ఎదురవుతున్న సమస్యలను ప్రజెంటేషన్ ద్వారా ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, కేవలం రూ. 2,654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను సీతారామ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసి 20 వేల కోట్ల రూపాయలకు పెంచి గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. దశాబ్ద పాలనలో సీతారామ ప్రాజెక్టుపై రూ.8వేల కోట్లు ఖర్చు పెట్టిన గత ప్రభుత్వం ఒక్క ఎకరానికి కూడా తాగునీరు ఇవ్వలేదని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షలు చేశామన్నారు. సీతారామ ప్రాజెక్టుకు ఎన్ఎస్పీఎల్ కెనాల్ కు లింకు చేయడానికి 9 కి.మీ ఉన్న ఎన్కూర్ లింక్ కెనాల్ ను పూర్తి చేయడానికి రూ.72 కోట్లు మంజూరు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ముందు ఈ పనులను సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వైరాకు వచ్చి శంకుస్థాపన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా పంప్స్ ట్రయల్ రన్ చేయడానికి కావలసిన పవర్ సప్లై కోసం నిధులు ఇచ్చామన్నారు. పంప్స్ ట్రయల్ రన్ ప్రాసెసింగ్ కొనసాగుతుందని చెప్పారు. ఎన్కూర్ లింకు కెనాల్ ను రాజీవ్ కెనాల్ గా నామకరణం చేస్తున్నట్టు వెల్లడించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌజ్ 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు తొందరలోనే మొదలు పెడతామని వెల్లడించారు.

**ఇరిగేషన్ సెక్టార్ ను నాశనం చేసిన కేసీఆర్ ప్రభుత్వం మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

ప్రణాళిక లేకుండా అనాలోచితంగా ఇరిగేషన్ సెక్టార్ ను గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రం కోలుకోలేని విధంగా ఆర్థికంగా చాలా నష్టం చేసిందని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కేవలం 93,000 ఎకరాల కొత్త ఆయకట్టుకు మాత్రమే సాగులోకి తీసుకువచ్చిందని తెలిపారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు ఖర్చుపెట్టి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఎకరం కూడా కొత్త ఆయకట్టు తీసుకురాలేదన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.9,000 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరం కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వలేదన్నారు. గత బిహారీ సర్కార్ మొదలుపెట్టిన ఏ సాగునీటి ప్రాజెక్టులను పదేళ్ల పాలనలో పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. 2,000 కోట్లతో పూర్తయి రాజీవ్ సాగర్ ను సరైన కారణం లేకుండా రీ డిజైన్ చేసి 20 వేల కోట్ల రూపాయలకు గత ప్రభుత్వం పెంచడం వెనుక ఆంతర్యం ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం గోదావరి నది జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకొచ్చి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రీ డిజైన్ పేరిట తప్పుడు నిర్ణయం తీసుకొని రాష్ట్రానికి ఆర్థిక భారం మోపినప్పటికీ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రైతులకు మేలు జరిగే విధంగా భారీ మధ్య చిన్న తరహా సాగునీటి పెండింగ్ ప్రాజెక్టును ఖమ్మం జిల్లాలో పూర్తి చేస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.

## శాంతియుతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**విశ్వంభర, మెదక్ :** రాబోయే బక్రీద్ పండుగను శాంతియుతంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా ప్రజలను కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటి టు ఎనిమల్స్" ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ మహేందర్ జిల్లా పశు వైద్యాధికారి విజయ శేఖర్ రెడ్డితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... జిల్లాలో పోలీస్ శాఖ ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి జంతువుల చట్టాల గురించి అవగాహన కల్పించాలని, బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని తెలియజేయాలన్నారు.

జంతువుల నిబంధనలను ఉల్లంఘిస్తే వెయ్యి రూపాయలు జరిమానా గాని, మూడు నెలలు జైలు శిక్ష గాని విధిస్తారని తెలియజేశారు. జిల్లాలో తూప్రాన్ టోల్గేట్, నర్సాపూర్ చౌరస్తా, కోల పల్లి చెక్ పోస్టుల వద్ద పోలీసు, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులతో సమీకృత చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తారని పశువుల అక్రమ రవాణాను నిరోధించి పట్టుబడిన పశువులను దగ్గర్లోని గోశాలలకు తరలించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి ముందుగానే బైండోవర్ చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. జిల్లాలో కుక్కల బెడద, కోతుల బెడద నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మెదక్ లో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ను అతి త్వరలో ప్రారంభించాలని మెదక్ మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో పోలీసు, వెటర్నరీ, రవాణా శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలి

**మెట్పల్లి 'బడిబాట'లో అధికారులు, నాయకులు**



**విశ్వంభర, మెట్పల్లి:** జగిత్యాల జిల్లా, కోరుట్ల నియోజకవర్గం, మెట్పల్లి పట్టణంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మోహన్ మెప్మా, ఈవో శ్రీనివాస్ గౌడ్, ఎంఈఓ భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని, ప్రైవేటు పాఠశాలల్లో నిర్బంధ విద్యతో పిల్లలు మానసిక ఒత్తిడికి లోనై భవ్య ప్రపంచంలో ఎదగలేకపోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో మహిళలు తక్కువ సంఖ్యలో ఉద్యోగాలు చేస్తున్నారని, బాలికలే ఉన్నతంగా ఎదిగి భవిష్యత్తులో పేరు ప్రఖ్యాతులు పొందాలని అభిలాషించారు. అనంతరం పిల్లలు చేసిన చేతి కళా ప్రదర్శనను తిలకించారు. ప్రతి తల్లిదండ్రి పిల్లలను సర్కారు బడిలోనే చదివిస్తూ ఆర్థికంగా ఎదుగుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కూల్ ప్రిన్సిపాల్ కనకతార మాట్లాడుతూ, పిల్లలకు ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం రెండు జతల స్కూల్ యూనిఫామ్, టెక్స్ట్, నోట్ బుక్స్ పంపిణీ చేస్తుందని తెలిపారు. పాఠశాలలో 10/10 సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ సుజాత సత్యనారాయణ, వార్డు మెంబర్లు, మహిళా మండలి అధ్యక్షులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలతో మానసిక ఉల్లాసం

**సూర్యాపేట సూపరింటెండెంట్ సిహెచ్ పాల్ రాజ్**



**విశ్వంభర, సూర్యాపేట:** విద్యుత్ శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం వలన వారిలో మానసిక ఉల్లాసం కలుగుతుందని విద్యుత్ శాఖ సూర్యాపేట సూపరింటెండెంట్ సిహెచ్ పాల్ రాజ్ అన్నారు. వారికి ఇతర జిల్లాల ఉద్యోగులతో కలిసి ఆటల పోటీలు నిర్వహిస్తే ఉద్యోగుల మధ్య ఐకమత్యం, స్నేహభావం పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న టిజి ట్రాన్స్ కో, డిస్కమ్ ఉద్యోగుల అంతరాష్ట్ర కబడ్డీ, చెస్ టోర్నమెంట్ 202425 వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జూన్ 13,14 తేదీలలో నిర్వహించే ఈ క్రీడా పోటీలలో కబడ్డీ 11సర్కిల్స్, చెస్ పోటీలలో 16 టీమ్ లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో డిఇ ట్రాన్స్ కో డానియల్ , ఎ. శ్రీనివాస్ డి ఇ ఆపరేషన్ సూర్యాపేట, వెంకట కిష్టయ్య డిఇ హుజూర్ నగర్, రాజశేఖర్ డి, భీమా నాయక్ డిఇ, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్, స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాస్, ఏఇ టౌన్ సురేష్ పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

**విశ్వంభర, ఆమనగల్లు:** గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కల్వకుర్తి ఏఈ శ్రీనివాస్ సూచించారు. ఈనెల నుంచి గృహ జ్యోతి పథకం జిల్లాలో అమలవుతుందని, ఎవరికైనా ఈ పథకం వర్తించనట్లయితే వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మున్సిపాలిటీ ప్రజలు మున్సిపల్ కార్యాలయం, రూరల్ ఏరియా ప్రజలు ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కార్డు, కరెంటు బిల్లు, రేషన్ కార్డుతో పాటు ప్రజా పాలన దరఖాస్తు నంబర్ జత చేయాలని సూచించారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ జోలికి వస్తే చూస్తూ ఊరుకోం

**కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్**



**విశ్వంభర, కరీంనగర్:** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మీద నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాడి కౌశిక్ రెడ్డి మతిభ్రమించి ఆయన ఒక ఎమ్మెల్యే అన్న విషయం మర్చిపోయి ఫ్లైయాష్ విషయంలో అవినీతి జరుగుతుందని అందులో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రమేయం ఉందని చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కనీస పరిజ్ఞానం లేకుండా పాడి కౌశిక్ రెడ్డి ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని కమిషన్లు తీసుకునే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీదని, నీ సొంత నియోజకవర్గమైన హుజురాబాద్ లో పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న దళిత బంధు స్కీం లో మీరు కమిషన్లు తీసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దళితులను కొట్టి పంపించిన మాట వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. అనుకుంటున్నారని కానీ తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారు అని ఆయన అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిష్టకు భంగం కలిగేలా కాంగ్రెస్ పార్టీ,ప్రభుత్వ ప్రతిష్టకు బంధం కలిగేలా వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి పై పోలీస్ కంప్లైంట్ ఇస్తామని, వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ కు క్షమాపణలు చెప్పాలని లేదంటే వీణవంక చౌరస్తా నుండి కౌశిక్ రెడ్డి ఇంటి వరకు చావు డప్పుల తో నిరసన తెలుపుతామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

# బడిడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలోనే చేర్పించాలి

## మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



**విశ్వంభర, నారాయణఖేడ్ :** బడి ఈడు పిల్లలందరిని తప్పనిసరిగా తల్లిదండ్రులు ప్రభుత్వ బడిలో చేర్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వీరోజిపల్లి తండా పెద్ద శంకరంపేట లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తో కలిసి విద్యార్థులకు నోటు పుస్తకాలు యూనిఫామ్ లను అందజేశారు. అనంతరం పెద్ద శంకరంపేట లోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే, జిల్లా విద్యాధికారి రాధా కిషన్ లు మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించే విధంగా సర్వే చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని మౌలిక వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తుందని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ టీచింగ్ స్టాఫ్ తో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచిర్యాంకులు సాధించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు : ఖేడ్ ఎమ్మెల్యే**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, రాగిజావ అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్య రంగానికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 6,000 పాఠశాలలు మూతపడ్డాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుందన్నారు. నారాయణఖేడ్ ప్రాంతం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ చతుర్థ ర్యాంకులు సాధించారని ఆయన వివరించారు.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయ కృషి వల్ల విద్యార్థులు జీవితంలో మంచి స్థాయికి ఎదుగుతారన్నారు... ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించడం జరిగిందన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో సైతం అంగన్వాడీ టీచర్లు చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధా కిషన్, తాసిల్దార్ గ్రేసీ బాయ్ ఎంపీడీవో రఫిక్ ఉన్నిశా, ఎంఈఓ బుచ్చా నాయక్.. ఎంపీపీ జంగం శ్రీనివాస్ నోడల్ అధికారి వెంకటేశం, ఎంపీటీసీలు మీనా సుభాష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిని మధు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్ పనులను నిలిపివేయాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ మైనింగ్ తవ్వకాలు చేపడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, రైతులు ఆర్.టి.ఐ 2005 చట్టం ప్రకారం మైనింగ్ కి ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఎదురు తిరిగిన వారిపై కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడి వారిని పంట వేసుకోకుండా వారి పొలాల్లో మైనింగ్ రాళ్లను డంపింగ్ చేశారని వాపోయారు. దీంతో చుట్టుపక్కల వ్యవసాయ భూములలోని బోరు బావులు కుంగిపోవడంతో పాటు తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో సర్వే నెంబర్ 22 లో 42 ఎకరాల భూమి ఉందని అందులో 32 ఎకరాలకు గతంలో మైనింగ్ కు అనుమతి ఉన్నా, 42 ఎకరాల్లో భూమి అంతా వాడుకుంటున్నారని ఎమ్మార్వో కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుజ్జుల మహేష్, పరమేష్, నిర్మలమ్మ, బాలమ్మ, వీరప్ప,యాదయ్య, రమేష్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

## ఆత్మకూరు హైస్కూల్ హెచ్ఎంగా మహదేవ రెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన కె. మహదేవ రెడ్డిని పిఆర్టీయూ టిఎస్ ఆత్మకూరు (ఎం) మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయూ టిఎస్ రాష్ట్ర నాయకులు యాస పద్మారెడ్డి, జిల్లా నాయకులు పాండురంగం, కృష్ణారెడ్డి, కరుణాకర్, చిత్తరంజన్, అరవిందరాయుడు, లక్ష్మణ్, రవీందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సకాలంలో కాంట్రాక్ట్ పనులు పూర్తి చేసే వారికే టెండర్లు

### రివ్యూ మీటింగ్ లో అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్



**విశ్వంభర, దేవరకొండ:** నియోజకవర్గంలో కాంట్రాక్టర్లు అడ్డగోలుగా గుంతలు తవ్వి రోడ్లను వేయకుండానే మధ్యలోనే వదిలేస్తున్నారని వారి కాంట్రాక్ట్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులకు సూచించారు. దేవరకొండలో బుధవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్ అధికారులు, కాంట్రాక్టర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇప్పటివరకు చాలా పనులు పెండింగ్ లో ఉన్నాయని కాంట్రాక్టర్లు టెండర్లు వేసి సిసి రోడ్లు మాత్రమే వేసి మిగతా బీటీ రోడ్లను వదిలేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎవరైతే ముందుగా బీటీ రోడ్డుకు టెండర్లు వేస్తారో బీటీ రోడ్డు అయిన తర్వాతనే సిసి రోడ్లు వేసే కార్యక్రమం చేపట్టే విధంగా అధికారులు కాంట్రాక్టర్ కు సూచించాలని ఎమ్మెల్యే తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో టెండర్లు వేసే కాంట్రాక్టర్లు తప్పనిసరిగా పనులు చేస్తామని ధీమా ఉంటేనే టెండర్లు వేయాలి... లేకుంటే మానుకోవాలని ఆయన కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, ఎంపీపీ నల్లగాస్ జాన్ యాదవ్, బిక్కు నాయక్, పిఎసిఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్లు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, సిరందాస్ కృష్ణయ్య, ఏడుపుల గోవిందు యాదవ్, మారుపాకుల సురేష్ గౌడ్, R&B,RWS శాఖల SC,EE,DE,AE అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యార్థులకు మార్వాడి యూనివర్శిటీలో ప్లేస్మెంట్

**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణ విద్యార్థులకు గుజరాత్ లోని మార్వాడి యూనివర్సిటీలో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. గుజరాత్ లోని రాజ్ కోట్ లో ఉన్న మార్వాడి విశ్వవిద్యాలయం వారు తెలంగాణకు చెందిన ముగ్గురు అత్యుత్తమమైన విద్యార్థులకు ప్లేస్మెంట్ ప్రకటించారు. మార్వాడి విశ్వవిద్యాలయం తన విభిన్న విద్యార్థి సంఘానికి అత్యున్నత స్థాయి విద్య, ప్లేస్మెంట్ అవకాశాలను అందించడంలో నిబద్ధతకు నిదర్శనంగా చెప్పవచ్చు. విజయవాడకు చెందిన మల్లవరపు జార్జ్ సందీప్, తాతపట్నంకు చెందిన పోలాకి సందీప్, అవనిగడ్డకు చెందిన కొమరపాలెం భాను శ్రీ అనే ముగ్గురు విద్యార్థులు చక్కటి ప్యాకేజీలతో ప్రఖ్యాత కంపెనీల్లో ట్రైనీ ఇంజనీర్లుగా నియమితులయ్యారు. ఇంజనీరింగ్ స్ట్రీమ్ లో వివిధ కోర్సులలో మార్వాడి విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న తెలంగాణకు చెందిన 100 విద్యార్థుల్లో వారున్నారు. వాస్తవానికి గత మూడు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ నుండి కనీసం 120 మంది విద్యార్థులు రాజ్ కోట్ లోని మార్వాడీ విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం నమోదు చేసుకున్నారు. వీరిలో చాలా మంది వివిధ సంస్థల నుండి అద్భుత ప్యాకేజీలను పొందారు.

## ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఘన స్వాగతం

**విశ్వంభర, షాద్‌నగర్/ఆమనగల్లు :** మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ గా గెలుపొంది గురువారం ప్రమాణ స్వీకారం చేసిన నాగరకుంట నవీన్ రెడ్డి కి షాద్ నగర్ లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షాద్ నగర్ చౌరస్తా లో భారీ గజమాల, బాణాసంచాలతో మార్మోగిపోయింది. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి భారీ ర్యాలీ తో షాద్ నగర్ ముఖ్య వీధుల గుండా ర్యాలీగా వెళ్లారు.

**భారీ గజమాలతో సత్కారం**

కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ లో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. యువ నాయకుడు శివ చారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, యువకులు, అభిమానులు,





పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారం అనంతరం నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని చేగూర్ రోడ్డు వద్ద భారీ గజమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా శివ చారి మాట్లాడుతూ.. నవీన్ రెడ్డి గెలుపుతో షాద్‌నగర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో ఒక ధైర్యం వచ్చిందన్నారు.

**ఆమనగల్లులో...**

ఉమ్మడి పాలమూరు స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో నవీన్ రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆయన ప్రమాణస్వీకారం అనంతరం గ్రామీణ అభివృద్ధి స్టాండింగ్ కమిటీ జిల్లా సభ్యులు కడ్తాల్ జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు

### విద్యుత్ శాఖ అధికారులపై ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆగ్రహం

**విశ్వంభర, నారాయణఖేడ్:** విద్యుత్ శాఖ అధికారులు తమ పనితీరును మార్చుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పెద్ద శంకరంపేటలో నిర్వహించిన విద్యుత్ శాఖ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఆ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. వారం రోజులలోపు అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలాగా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాలలో ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని తెలిపారు. అలాగే సొసైటీ అధికారులు రైతులను నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, రైతులకు ఎవరు నష్టపరిచినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద నుంచి 8 కిలోల వరకు తరుగు తీస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని వీటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పై అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డి ఈ కృష్ణారావు, ఏడి మోహన్ బాబు, ఏవో శ్రీకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయిని మధు నారా గౌడ్, సురేందర్ రెడ్డి, సుభాష్ గౌడ్ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కడియం కావ్యను కలిసిన మొయినొద్దీన్



**విశ్వంభర, వరంగల్ :** వరంగల్ ఎంపీ కడియం కావ్యను NHRC & WEO చైర్మన్ మొయినొద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మొయినొద్దీన్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని పురుషులకు మాత్రమే కేటాయించారని, ఇప్పుడు ఒక మహిళకు కేటాయించడం , ఆమె అత్యధిక మెజారిటీతో విజయం సాధించడం గొప్ప విషయం అన్నారు. జాతీయ స్థాయిలో మా ఆర్గనైజేషన్ పనిచేస్తున్నదని , ప్రతీ రాష్ట్రంలో గల కమిటీలు సామాజిక సేవలో నిమగ్నమై నిర్విరామంగా కృషి చేస్తున్నాయని కడియం కావ్యకు వివరించారు. మహిళా, శిశు హక్కులను , వాటి పట్ల గల ప్రయోజనాలను అవగాహన కల్పించేందుకు జిల్లా, మండల , గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీ కావ్యకు చైర్మన్ మొయినొద్దీన్ చెప్పారు. ఈ విషయాలను గమనించిన ఎంపీ కావ్య మాట్లాడుతూ, ఏ స్వార్థం లేకుండా ప్రజలకు సేవ చేస్తున్న చైర్మన్ మొయినొద్దీన్ , ఆర్గనైజేషన్ సభ్యులను అభినందించారు. అలాగే రానున్న రోజుల్లో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని అందుకు ఎంపీ గా తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో NHRC & WEO రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్, ఇంచార్జి గనిపాక కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్, ఉపాధ్యక్షులు శ్యాం, కార్యదర్శి విజయ్, మహిళా విభాగపు ఉపాధ్యక్షులు సంధ్యారాణి కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



**విశ్వంభర, ఆమన్ గల్ :** మండలంలోని మేడిగడ్డ తండా గ్రామపంచాయతీకి చెందిన వి. బిచ్య విజయ ల కుమారుడు విక్కీని గురువారం మేడిగడ్డ తండా గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ నాయక్. కె.ఎస్.ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందించారు. గిరిజన తండాకు చెందిన విక్కీ అత్యుత్తమ వైద్య, విద్య ఎంబీబీఎస్ లో సీటు సంపాదించడం గ్రామానికి ఎంతో గర్వకారణమని అన్నారు. విక్కీని ఆదర్శంగా తీసుకొని గ్రామ విద్యార్థులు మరింత ముందుకు రావాలని పట్టుదలతో చదివి ఉత్తమ డాక్టర్ గా రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

## జలదుత్ యాప్ ద్వారా ఫొటో క్యాప్చర్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులపై అధికారుల అదేశానుసారం జలదుత్ యాప్ ద్వారా భూమిలో నీటిమట్టం స్థాయి ఏవిధంగా ఉందో తెలుసుకోవడానికి గ్రామానికి రెండు లేదా మూడు బావుల ఫొటోలు క్యాప్చర్ చేస్తారు. గురువారం సింగారం గ్రామంలో ఉపాధి హామీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సుంకరి శ్రీనివాస్ గౌడ్ జలదుత్ యాప్ ద్వారా బావుల్లోని నీటిమట్టం ఏస్థాయిలో ఉందో ఫోటో క్యాప్చర్ చేశారు. ఆయాగ్రామాల్లోని ఏఫ్ఏలు జలదుత్ యాప్ ద్వారా నీటి మట్టం స్థాయిని క్యాప్చర్ చేశారు.

## మిషన్ భగీరథ సర్వే వివరాలను పరిశీలించిన కలెక్టర్



**విశ్వంభర, నారాయణఖేడ్:** నారాయణఖేడ్ మండల కేంద్రం పెద్ద శంకరంపేటలో మిషన్ భగీరథ సర్వే వివరాలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం పరిశీలించారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీటి కుళాయిల సర్వేను ఆయన పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గ్రేసీ బాయ్, ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, ఈవో వెంకట రాములు తదితరులు ఉన్నారు.

# గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంపై ఈడీ కేసు నమోదు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు ఈడి షాక్ ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. తెలంగాణలో గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలపై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలోనే మనీలాండరింగ్ చట్టం కింద ఈసీఐఆర్ నమోదు చేసింది. ఈ సందర్భంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద దీనిపై విచారణ చేపట్టనున్నామని బుధవారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు ఈడీ జోనల్ ఆఫీసు నోటీసులు ఇచ్చింది. ఈ పథకానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని ఈడీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో గొర్రెల కొనుగోళ్లలో రూ.700 కోట్ల స్కామ్ జరిగిందని ఏసీబీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గొర్రెల కొనుగోలు వ్యవహారంపై ఈడీ ఫోకస్ పెట్టింది. ఏసీబీ కేసు ఆధారంగానే ఈడీ దర్యాప్తు ప్రారంభించనుంది. గొర్రెల పంపిణీలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లాల వారీగా లబ్ధిదారుల పేర్లు, వారి అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు తదితర సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఈడీ శాఖను కోరింది. మరోవైపు గొర్రెల పంపిణీ పథకంలో అవినీతి జరిగిందన్న ఏసీబీ అధికారులు కేసులో పది మంది నిందితులను గుర్తించారు. మరోవైపు దర్యాప్తులో భాగంగా అరెస్టై జైల్లో ఉన్న పశుసంవర్ధకశాఖ సీఈవో రామ్‌చందర్‌నాయక్, మాజీ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్‌లను ఏసీబీ అధికారులు కోర్టు అనుమతితో అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వారిని విచారించేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది.





## ఆస్పత్రిలో వసతులను పెంచుతాం ఎమ్మెల్యే కౌసర్ మొహినొద్దీన్

**విశ్వంభర, మెహిదీపట్నం:** రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినొద్దీన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన గోల్కొండ లోని ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వసతులు రోగులకు అందిస్తున్న సేవలను సూపరింటెండెంట్ మజర్ అలీని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రిన్సిపల్ సెక్రెటరీ తో పాటు కలెక్టర్ తో త్వరలో సమావేశం అవుతానని తెలియజేశారు. ఆస్పత్రిలో వసతుల్లో కల్పనకు తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. సేవే పరమావధిగా పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్యయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్



**విశ్వంభర, హిమాయత్ నగర్ :** సిగరెట్లు, బీడీలు ఇవ్వనందుకు కక్ష పెంచుకొని ఒక వ్యక్తి పై హత్యయత్నం చేసిన సంఘటన నారాయణగూడ పీస్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం నారాయణగూడ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నారాయణగూడ ఫ్లైఓవర్ కింద ఫుట్పాత్ పైన నివసిస్తున్నటువంటి సత్యనారాయణ అనే వ్యక్తి పడుకొని ఉండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి సమయంలో తన వద్దకు వచ్చి సిగరెట్లు అడిగినాడని సదరు సత్యనారాయణ నిద్ర నుంచి ఎందుకు లేపుతున్నావని అతన్ని కోపడగా ఆ గుర్తుతెలియని వ్యక్తి పక్కన ఉన్నటువంటి చెక్క కుర్చీతో సత్యనారాయణ ముఖం పైన తల పైన బాదాడు. దీనివల్ల సత్యనారాయణకు తలకు, ముఖానికి తీవ్రగాయాలు అయ్యాయి. సత్యనారాయణ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. ఎస్సై జి నరేష్ నిందితున్ని గురువారం గుర్తించి పట్టుకొని విచారించగా చిట్టి భూపాల్ తండ్రి లక్ష్మన్న వయసు (23) నిందితుడు గాంధీ నగర్ లోని ఒక ప్రింటింగ్ ప్రెస్ పనిచేస్తూ ఉంటాడని.. నిందితుడు సత్యనారాయణ వద్దకు ఇదివరకు అనేకసార్లు సిగరెట్లు బీడీలు అడుక్కునేవాడని.. గత రెండు నెలల క్రితం సత్యనారాయణ నిందితునికి సిగరెట్లు ఇవ్వక పోవడం వలన తన పైన కోపం పెంచుకున్నాడు. తనను ఎలాగైనా హత్య చేయాలని ఉద్దేశంతో సత్యనారాయణ పడుకుని ఉన్న సందర్భంలో లేపి మరి పక్కనే ఉన్న చెక్కకుర్చీతో బాది చంపాలని ప్రయత్నించాడు. అతను గట్టిగా అరవడం వల్ల అక్కడి నుంచి పారిపోయాడు అని తెలిపారు. నిందితున్ని తక్కువ సమయంలో పట్టుకున్న ఎస్సై జి నరేష్‌ను అలాగే ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షించిన సీఐ చంద్రశేఖర్‌ను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

## ప్రభుత్వం జాతీయ క్రీడా కోడ్ ను అమల్లోకి తీసుకురావాలి



**విశ్వంభర, బషీర్ బాగ్:** రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడా కోడ్ ను వెంటనే అమల్లోకి తీసుకురావాలని తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో గురువారం మీడియా సమావేశంలో పవన్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ టోర్నమెంట్ జరిగినా సంబంధిత క్రీడల్లో గుర్తింపు కలిగిన రాష్ట్ర, జిల్లా క్రీడా సంఘాల అనుమతితోనే జరిగాయని గుర్తు చేశారు. డబ్బులు దండుకోవడానికి తీరుకోక టోర్నమెంట్ పెడుతూ క్రీడాకారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్ర క్రీడా పోటీల పేరుతో కొంత మంది లక్షల్లో డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. క్రీడలపై అవగాహన లేని తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ పనికిరాని ఆటలు ఆడించి ఆ తరువాత బాధ పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. క్రీడా రంగాన్ని కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలోకి తెచ్చేలా ప్రభుత్వం క్రీడా ప్రణాళికలను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ టీఏజీ)ని నిద్రావస్థ నుంచి లేపి క్రీడా రంగాన్ని అభివృద్ధి పరచడానికి ప్రతి విభాగం ఉరకలు పెట్టేలా చర్యలు చేపట్టాలన్నారు. క్రీడారంగాన్ని తప్పించే వారిపై ఎస్ఏటీజీ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ (టీఓఏ)ని ప్రక్షాళన చేసి సరైన రథ సారధులతో క్రీడా సంఘాలు ఏర్పడేలా చూడాలన్నారు. క్రీడా సంఘాలన్నింటికి సముచిత స్థానం కల్పించేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని పరిపాలనా విభాగాల్లో ఉన్నట్లుగా క్రీడా సంఘాల కోసం నెలకొకసారి, మూడు నెలలకొకసారి గ్రీవెన్స్ డే ఫర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అటు టీఓఏలో ఇటు ఎస్ ఏటీజీలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేష్, ప్రతినిధులు లక్ష్మణ్, తిరుమల్ రెడ్డి, విజయ్ కుమార్, సురేందర్, సి.పుల్లయ్య పాల్గొన్నారు.

### తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన కమిటీ

**విశ్వంభర, సూర్యాపేట టౌన్:** తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ,జిల్లా నూతన కమిటీని గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఎన్నుకున్నారు. సూర్యాపేట జిల్లా ఇన్చార్జి , రాష్ట్ర కార్యదర్శిగా పడిదల రవికుమార్ మాదిగను , రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరికంటి అంబేద్కర్ మాదిగను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పడిదల రవికుమార్ మాదిగ మాట్లాడుతూ, మాదిగలకు, మాదిగ ఉపకులాలకు బిజెపి ప్రభుత్వం న్యాయం చేయడంలో విఫలమైందన్నారు. మాదిగలంతా ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని కోరారు. మరికంటి అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ, మాదిగల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తమపై నమ్మకంతో తమ ఎన్నికకు సహకరించిన సంఘ నాయకులకు ,రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ ఓర్వలేని తనం

- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



**హైదరాబాద్:** ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని తెలుగు పుస్తకాల్లోని ముందుమాటలో కేసీఆర్ పేరుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతుందన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్. ఇప్పటికే విద్యార్థులకు పంపిణీ చేసిన 2 కోట్ల పుస్తకాలను మళ్లీ వెనక్కి తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దేశపతి శ్రీనివాస్ స్పందించారు. 2014లో కొత్త పుస్తకాలు రూపొందించలేదు.. పాత పుస్తకాలనే కొనసాగించాం. ఒక్క సంవత్సరం పాటు అవే పుస్తకాలను విద్యార్థులు చదువుకున్నారు. ఆనాడు ఉమ్మడి ఏపీలో ఉన్న సిలబస్‌నే చదువుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఎడిటర్లు, సీఎం, విద్యాశాఖ మంత్రి పేర్లు యధావిధిగా ఉన్నాయి. ముందుమాటలో కేసీఆర్ పేరు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతోంది. దాదాపు 2 కోట్లకు పైగా పుస్తకాలు వాపస్ తెప్పించినట్లు వార్తలు వినిపిస్తున్నాయని దేశపతి పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ ముందుమాట కోసం కొత్త పుస్తకాలను ముద్రించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప ఒరిగేదేమీ లేదు. అనవసరపు నిర్ణయాలతో ప్రజా ధనం దుర్వినియోగం చేయొద్దు. ఇప్పుడున్న పుస్తకాలు మార్చే అవకాశం లేదు. మార్చాలంటే కొత్త కమిటీ ఏర్పాటు చేయాలి. ఇప్పటికిప్పుడు కొత్త కమిటీ ఏర్పాటు చేయడానికి సమయం లేదు. వచ్చే ఏడాది పుస్తకాలు మార్చుకోవచ్చు.. అప్పుడు మీ పేర్లు పెట్టుకోవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొంచపు బుద్ధి ఉంది. విగ్రహాలు మార్చుడు, గుర్తులు మార్చుడు అనే ధోరణిలో ఉన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం సంకుచిత దృక్పథం వల్ల ప్రజా ధనం వృధా అవుతోంది. రేవంత్ రెడ్డి మాకు భేషజాలు లేవని అంటాడు మరి ఆయన చేసేది ఏంటి..? ప్రజాపాలన అంటూనే ప్రతి చిన్న విషయాల్లో కూడా సంకుచిత బుద్ధిని ప్రదర్శిస్తున్నారు అని దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు.

## కళ్ళు మూసుకు పోయాయా

- ప్రతి దానికి అనవసరపు రాద్ధాంతం
- బాల్క సుమన్‌కు ఎమ్మెల్సీ బల్మూరి కౌంటర్





**విశ్వంభర, హైదరాబాద్:** మహనీయుల సరసన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో పెట్టడం ఏమిటనీ సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు చేస్తోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బాల్క సుమన్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విమర్శించారు. మహనీయుల సరసన రేవంత్ రెడ్డి ఫోటో పెట్టడం వారిని అవమానించడమేనని సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను ట్వీట్ చేశారు. సాక్షాత్తు శాసనమండలి ఛాంబర్లో జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రముఖ సామాజిక వేత్త, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాల సరసన రేవంత్ రెడ్డి ఫోటోను పెట్టడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని ట్వీట్‌లో పేర్కొన్నారు.దీనిపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా స్పందిచాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ వెంకట్ బల్మూరి కౌంటర్ ట్వీట్‌తో కేసీఆర్ ఉన్న ఫోటో పంచుకున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన ఫోటో అక్కడే ఉందన్నారు. అప్పుడు కళ్ళు మూసుకు పోయాయా? ప్రతి దానికి అనవసరపు రాద్ధాంతం అని ప్రశ్నించారు. జనాలు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పిన ఇంకా పద్ధతి మారక పోతే ఎవరూ ఏం చేయగలరని, మిమ్ముల్ని మీరే బొంద పెట్టుకుంటా అంటే ఎవరు వద్దంటారని విమర్శించారు. తెలంగాణకు ఇన్నాళ్లు పట్టిన భ్రష్టు వదులుతుంది అంటే తెలంగాణా ప్రజానీకానికి అంతకు మించి ఏం కావాలని గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్న ఫోటోను ఎమ్మెల్సీ వెంకట్ బల్మూరి కౌంటర్ ట్వీట్ చేశారు.



## గాంధీ భవన్‌కు బాస్ ఎవరు?

- పీసీసీ చీఫ్ రేసు చాలా మంది నేతలు
- ముగిసిన సార్వత్రిక ఎన్నికలు
- అందరిని కలుపుకొని వెళ్లే నేతపై అధిష్టానం ఫోకస్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుతం పీసీసీ చీఫ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డిని సీఎం పదవి వరించింది. అయితే లోక్‌సభ ఎన్నికలు కూడా దగ్గర్లోనే ఉండటంతో ఆయన్నే పీసీసీ చీఫ్‌గా కొనసాగించారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు ముగిసాయి. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కూడా కొలువు తీరింది. అదే సమయంలో రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్ పదవి కూడా ఈ నెల 27తో ముగియబోతోంది. దీంతో జోడు గుర్రాలపై ఉన్న రేవంత్‌రెడ్డికి పార్టీ బాధ్యతల నుంచి విముక్తి కలిగించి, ఆయన పూర్తిగా పాలన మీదే దృష్టి సారించేలా చూడాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అందుకే ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేయగలిగే నేతను పీసీసీ చీఫ్‌గా నియమించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు ప్రారంభించింది. పీసీసీ చీఫ్‌గా ఎవరిని నియమిస్తే బాగుంటుందనే చర్చ కాంగ్రెస్ క్యాడర్లో విస్తృతంగా జరుగుతోంది. గాంధీభవన్ బాస్‌గా హై కమాండ్ ఎవరిని నియమించినా తనకు సమ్మతమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్నారట. పార్టీని ప్రతిపక్షం నుంచి అధికారంలోకి తీసుకొచ్చిన రేవంత్ రెడ్డి స్థాయిలో పని చేయగలిగే వ్యక్తి ఎవరున్నారనే అంశంపై పార్టీ అధిష్ఠానం ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది? ఎవరైతే నేతలందరినీ కలుపుకొని వెళ్ళగలరు అనే దానిపై హై కమాండ్ సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అనేక పలువురు సీనియర్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**ఆశలు పెట్టుకున్న సీనియర్ లీడర్లు**

ఈ పదవిపై చాలా మంది సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నట్లు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి తనకు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని చాలారోజుల నుండి అడుగుతున్నారు. ఇప్పుడు కూడా తాను పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తాను పోటీ చేయకుండా ఇద్దరు కుమారులకు సీట్లు ఇప్పించుకుని గెలిపించుకున్న సీనియర్ నేత జానారెడ్డి పీసీసీ చీఫ్ పదవి కోరుతున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా పీసీసీ చీఫ్ పదవి కావాలని హైకమాండ్ ని రిక్వెస్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకు పీసీసీ చీఫ్ పదవి ఇవ్వరనే వాదన బలంగా వినిపిస్తోంది. దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నేతలు పీసీసీ చీఫ్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం పీసీసీ చీఫ్ రేసులో ఉన్నారు. తాను విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని తనకి అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే బాగుంటుందని కాంగ్రెస్ పెద్దల దగ్గర చెబుతున్నట్లు సమాచారం. వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సైతం పీసీసీ రేసులో తాను ఉన్నట్లు ప్రకటించారు. మరో బీసీ నేత మధుయాష్కీ గౌడ్ కూడా పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ సైతం ఆ పదవి తనకి వస్తుందనే ధీమాలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆశించినా సంపత్‌కు టిక్కెట్ దక్కలేదు. అందుకే ఆయన పీసీసీ పదవి విషయంలో పట్టుపడుతున్నారు. ఎస్టీ సామాజిక వర్గాల నుంచి మంత్రి సీతక్క, బలరాం నాయక్ కూడా పీసీసీ చీఫ్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

**అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో**

చాలా మంది పీసీసీ చీఫ్ రేసులో ఉన్నప్పటికీ ఒక్కరికి ఒకే పదవి అనే నిబంధన ఏఐసీసీ పెట్టడంతో చాలా మంది సీనియర్లు అసంతృప్తికి లోనవుతున్నారట. పీసీసీ పదవి ఆశిస్తున్న పలువురు నేతలు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఉన్నారు. దీంతో వీరందరికీ ఏఐసీసీ నిబంధన ఇబ్బందికరంగా మారిందట. కర్నాటక రాష్ట్రంలో డిప్యూటీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్.. పీసీసీ చీఫ్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. పక్క రాష్ట్రంలో లేని నిబంధన తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు అంటూ ఇక్కడి సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా పీసీసీ చీఫ్ పదవి ఆశిస్తున్న మంత్రులు అధికార పదవి వదిలిపెట్టడానికి సిద్ధంగా లేరు. కొంత మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం ఈ నిబంధనను వ్యతిరేకిస్తున్నారు. అయితే కొందరు నేతలు మాత్రం చట్టసభల్లో లేనివారు, ప్రభుత్వంలో భాగస్వామ్యం లేనివారికి పీసీసీ చీఫ్ పదవి ఇస్తే పార్టీకి ఎక్కువ సమయం ఇస్తారని చెప్తున్నారు. మరి కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులను పరిశీలించిన బడంగ్ పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



**విశ్వంభర, బడంగ్ పేట్ :** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని కుర్మల్ గూడ జెఎన్ఎన్ యుఆర్ఎం కాలనీలో త్వరలో ప్రారంభించనున్న ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను బడంగ్ పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గురువారం పరిశీలించారు. కుర్మల్ గూడ లో పాఠశాల ఏర్పాటుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు, విద్యాధికారికి బడంగ్ పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇక్కడ అంగన్ వాడి కేంద్రం గురించి కూడా మంత్రి సీతక్కతో మాట్లాడానని, త్వరలోనే ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లలేక కొంతమంది చదువు మధ్యలోనే వదిలేసే పరిస్థితులు ఉండేవన్నారు. విద్యార్థులు ఇక్కడ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కృష్ణయ్య, డీఈఈ జ్యోతి రెడ్డి, నాయకులు భద్రమోని రమేష్, ఆనంద్ రెడ్డి, టి మల్లారెడ్డి, జంపయ్య, సాదిక్, కుమారి, మైన, హరి, జహంగీర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం కోట్ల రూపాయలు దుర్వినియోగం

- భద్రాద్రి జిల్లాలో నలుగురు మంత్రులు పర్యటన
- సీతారామ ప్రాజెక్టు పనులు పరిశీలన
- ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయాలి
- పనులలో అలసత్వం ప్రదర్శిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు
- సంబంధిత అధికారులకు మంత్రులు ఆదేశాలు



**విశ్వంభర, మణుగూరు :** ప్రణాళిక లేకుండా ఇరిగేషన్ వ్యవస్థను గత ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా నాశనం చేశారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రాజెక్టుల ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గురువారం భద్రాద్రి జిల్లాలోని అశ్వాపురం మండలం లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,తుమ్మల నాగేశ్వరావు,ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించి సీతారామ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. పనులు ఎంతవరకు వచ్చాయో పర్యవేక్షించారు. ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ముందుగా మంత్రులు అశ్వాపురం వస్తున్న సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంత్రులకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం సీతారామ ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా బీసీ కొత్తూరు వద్ద నున్న పంప్ హౌస్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరిగేషన్ ప్రాజెక్టు పంప్ హౌజ్ 1 వద్దకు చేరుకొని పంప్ హౌజ్ పనులను పరిశీలించి పవర్ సప్లైను ప్రారంభించారు. ఆతర్వాత పంపు హౌజ్ 3 వద్దకు చేరుకొని ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటివరకు జరిగిన ప్రాజెక్టు పనులు, కొనసాగుతున్న కెనాల్స్ పనులు, భూసేకరణ, ప్రాజెక్టు పూర్తి కావడానికి కావలసిన నిధులు ,ఎదురవుతున్న సమస్యలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా ఇరవై వేల ఎకరాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం గోదావరి నీళ్లను అందిస్తుందని తెలిపారు. రూ.2654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్,ఇందిరా సాగర్ ప్రాజెక్టులను సీతారామ ప్రాజెక్టుగా రీడిజైన్ చేసి 20 వేల కోట్ల రూపాయలకు పెంచి గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. దశాబ్ద పాలనలో సీతారామ ప్రాజెక్టుపై ఎనిమిది వేల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిన గత ప్రభుత్వం ఒక్క ఎకరానికి కూడా తాగునీరు ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షలు చేశామన్నారు.సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడానికి సమీక్షంచమన్నారు.సీతారామ ప్రాజెక్టుకు ఎన్ఎస్పిఎల్ కెనాల్ కు లింకు చేయడానికి 9కిలోమీటర్లు ఉన్న ఎన్కూర్ లింక్ కెనాల్ ను పూర్తి చేయడానికి 72 కోట్లు రూపాయలు మంజూరు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ముందు ఈపనులను శంకుస్థాపన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పంప్స్ ట్రయల్ రన్ చేయడానికి కావలసిన పవర్ సప్లై కోసం నిధులు ఇచ్చామన్నారు.

ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం కోట్ల రూపాయలు దుర్వినియోగం...

ప్రాజెక్టుల పేరుతో గత ప్రభుత్వం కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసిందని మంత్రులు విమర్శించారు. ప్రణాళిక లేకుండా ఇరిగేషన్ వ్యవస్థను గత ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా నాశనం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 90,4000 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కేవలం 93000 ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సాగులోకి తీసుకువచ్చిందని వివరించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 9000 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఒక ఎకరం కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వలేదన్నారు. గత బిహారీ సర్కార్ మొదలుపెట్టిన ఏ సాగునీటి ప్రాజెక్టులను 10 సంవత్సరాల పాలనలో పూర్తి చేయలేని అసమర్థత గత ప్రభుత్వముదని విమర్శించారు. కొత్తగూడెం,పినపాక, భద్రాచలం నియోజకవర్గలలో తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో సాగునీరు ఇవ్వడానికి ఇరిగేషన్ శాఖ ప్రణాళికను తయారు చేసుకొని ముందుకు పోతున్నామని వివరించారు.ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం గోదావరి నది జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకొొచ్చి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రీడిజైన్ పేరిట తప్పుడు నిర్ణయం తీసుకొని రాష్ట్రానికి ఆర్థిక భారం మోపిన ప్పటికీ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి కావడానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేంద్ర పర్యావరణ శాఖలో ఉన్న స్ట్రీలను తొలగించి పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. రైతులకు మేలు జరిగే విధంగా భారీ మధ్య చిన్న తరహా సాగునీటి పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. మంత్రుల పర్యటనలో జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మాజీ డిప్యూటీ మేయర్ ఇంట్లో చోరీ

**విశ్వంభర, వరంగల్ :** దోపిడీ దొంగల బీభత్సం తో ఒక్కసారిగా వరంగల్ సబ్ డివిజన్ ప్రజలు ఉలిక్కిపడ్డారు. వరంగల్ సబ్ డివిజన్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ గణేష్ నగర్ రోడ్ నెంబర్ 3, శివనగర్ ప్రాంతంలో ఉన్న మాజీ డిప్యూటీ మేయర్ కక్కే సారయ్యతో పాటు నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో గురువారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. మాజీ డిప్యూటీ మేయర్ సారయ్య ఇంట్లో దొంగలు 15 తులాల బంగారం 5000 రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా నాగరాజు ఇంట్లో దొంగలు బీరువా పగలగొట్టి పరారయ్యారు. ఉదయం బెడ్ రూమ్ కి వెళ్ళిన సారయ్యకు బీరువా పగలగొట్టి, బట్టలు చిందరవందరగా పడేసి ఉండడాన్ని గమనించి స్థానిక మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లోజ్ టీం లతో దర్యాప్తు చేపట్టారు. చాలా రోజుల తర్వాత వరంగల్ పరిధిలో వరుస దొంగతనాలు కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఘటన స్థలాన్ని డిసిపి భారీ, మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ మల్లయ్య పరిశీలించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



# సీఎం సిగ్నేచర్స్!

- బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు
- సీఎం హోదాలో మెగా డీఎస్సీపై తొలి సంతకం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఫైళ్లపై సంతకాలు
- అన్న క్యాంటీన్ల పునరాగమనం



**విశ్వంభర, విజయవాడ:** టీడీపీ నారా చంద్రబాబు నాయడు సీఎంగా గురువారం సాయంత్రం 4.41 గం.కు బాధ్యతలు స్వీకరించారు. సచివాలయం మొదటి బ్లాక్‌లోని ఛాంబర్‌లో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్నికల్లో ఇచ్చిన కీలక హామీల అమలుపై సంతకాలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చినట్లుగానే సీఎం హోదాలో మొదట మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛన్ రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం, స్కిల్ సెన్సెస్, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై సంతకాలు చేశారు.

**మెగా డీఎస్సీ దస్త్రంపై తొలి సంతకం**

ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు, 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ దస్త్రంపై సీఎం మొదటి సంతకం చేశారు. కేటగిరిల వారీగా పోస్టుల వివరాలు గమనిస్తే ఎస్జీటీ 6,371, పీఈటీ 132, స్కూల్ అసిస్టెంట్స్ 7725, టీజీటీ 1781, పీజీటీ 286, 52 ప్రిన్సిపల్స్.

**ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు సంతకం**

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై సీఎం చంద్రబాబు రెండో సంతకం చేశారు. ఈ చట్టం ముసుగులో కొందరు ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భూ భక్షణకు ఆస్కారం ఇచ్చేలా వివిధ సెక్షన్లను రూపొందించినట్లు టీడీపీ ఆరోపిస్తోంది. కబ్జా చేసిన ఆస్తులకు చట్టబద్ధత తెచ్చుకునేందుకు వైఎస్సార్సీపీ పెద్దలు పావులు కదిపారు. అయితే, తాము అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణగా ఉంటామని ప్రతిపక్షనేతగా చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలోనూ ప్రకటించారు.

**పింఛను రూ.4 వేలకు పెంపు**

2014లో అధికారంలోకి రాగానే చంద్రబాబు అప్పటికి రూ.200 ఉన్న పింఛన్‌ను 5 రెట్లు పెంచి వెయ్యి రూపాయలు చేశారు. ఆ తర్వాత దాన్ని 2 వేలకు పెంచారు. 2024 ఎన్నికల ప్రచారంలో 4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అంతేకాదు ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్‌ను వర్తింపజేస్తామని ప్రకటించారు. దివ్యాంగులకు పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. పింఛన్ పెంపు హామీలను నెరవేరుస్తూ చంద్రబాబు మూడో సంతకం చేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, తదితర విభాగాల వారికి జూలై 1న, కొత్తగా పెంచిన పింఛన్ 4 వేలు, అలాగే ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను వెయ్యి రూపాయల చొప్పున పెరిగిన మొత్తం రూ. 3 వేలు కలిపి రూ. 7 వేల పింఛన్‌ను అందించనున్నారు. ఆగస్టు నుంచి లబ్ధిదారులకు 4 వేల రూపాయల పింఛన్ అందనుంది.

**అన్న క్యాంటీన్ల పునరాగమనం**

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 183 అన్న క్యాంటీన్లు ప్రారంభించారు. అల్పాహారం, భోజనాన్ని 5 రూపాయలకే అందించారు. సగటున రోజుకు రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది అల్పాహారం, భోజనం తినేవారు. ఇందుకుగాను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సుమారు 31 కోట్లు ఖర్చు చేసింది. పేదలకు అన్నం పెట్టిన అన్న క్యాంటీన్లను కేవలం తెలుగుదేశం ప్రారంభించిందన్న కక్షతో జగన్ మూసివేయించారు. అయినా టీడీపీ నేతలు పలుచోట్ల అన్న క్యాంటీన్లను నిర్వహించారు. అధికారం చేపట్టిన వెంటనే వీటిని పునరుద్ధరిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఆ మేరకు నాలుగో సంతకాన్ని అన్న క్యాంటీన్ల దస్త్రంపై పెట్టారు.

**నైపుణ్య గణనపై ఐదో సంతకం**

యువత ఉన్నతస్థాయి విద్యను అభ్యసించినా దానికి తగ్గట్టు ఉద్యోగాలు రాకపోవడానికి ప్రధాన కారణం తగిన నైపుణ్యం లేకపోవడమే. ఈ సమస్య పరిష్కారానికే కూటమి నేతలు ఎన్నికల్లో నైపుణ్య గణన హామీనిచ్చారు. చంద్రబాబు ఐదో సంతకాన్ని ఈ దస్త్రంపైనే పెట్టనున్నారు. ఇలా నైపుణ్య గణన చేయడం దేశంలోనే తొలిసారి. దీని ద్వారా ఎవరిలో ఎలాంటి నైపుణ్యాలున్నాయనేది తేల్చనున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి, ఏ రంగానికి ప్రాధాన్యముంది, ఆ తరహా ఉద్యోగాలు పొందేందుకు ఎలాంటి నైపుణ్యాలు అవసరమో వాటిని అందించి రాష్ట్రంలో నిరుద్యోగిత తగ్గించేందుకు ఈ గణన చాలా ఉపయోగపడనుంది.

# త్వరలో ప్రేక్షకుల ముందుకు సాయి ధన్సిక 'అంతిమ తీర్పు'



**విశ్వంభర, సినిమా :** శ్రీ సిద్ధి వినాయక మూవీ మేకర్స్ బ్యానర్ పై, సాయి ధన్సిక, అమిత్ తివారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అంతిమ తీర్పు'. ఏ. అభిరాం దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని డి. రాజేశ్వరరావు నిర్మించారు. ఈ సినిమా ఒక విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో జరుగుతుంది. సాయి ధన్సిక ఒక గృహిణిగా ఈ సినిమాలో కనిపించబోతోంది. మిస్టరీ థ్రిల్లర్ గా ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు ఎం.అభిరాం, సంగీత దర్శకుడు కోటి పాటలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరో హైలెట్ కానుందని చిత్ర యూనిట్ తెలిపింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఈ సినిమా ఉంటుందని, సాయి ధన్సిక నటన సినిమాకు హైలెట్ కానుందని నిర్మాత డి.రాజేశ్వరరావు తెలిపారు.

# ఉత్తమ పైలట్ గా ధర్మపురి సంపత్

## ఉత్తమ సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు



**విశ్వంభర, వెల్గటూర్ :** మనం చేసే ఉద్యోగ బాధ్యతలను చిత్త శుద్ధి అంకిత భావంతో నిర్వహిస్తే గుర్తింపు దానంతట అదే వస్తుందనేది మనందరికీ తెలిసిన విషయమే. దీనికి నిదర్శనమే మన ధర్మపురి సంపత్. ధర్మపురి పట్టణానికి చెందిన బత్తిని సంపత్ 108 అంబులెన్స్ లో పైలట్ గా విధులు నిర్వర్తిస్తూ తను అందించిన సేవలకు గాను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పైలట్ గా గురువారం అవార్డును అందుకున్నారు. సంపత్ ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ లో సీనియర్ పైలట్ గా సకాలం లో రోగులను ఆసుపత్రికి చేరుస్తూ, వాహన మెయింటనెన్స్ తో పాటు మైలేజ్ తదితర అంశాలలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో స్టార్ పైలట్ గా ఎంపిక య్యారు. కరీంనగర్ లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ డా.సుజాత, ఈఎం ఆర్ఐ అధికారి కే. రవికుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ సలీంల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ అవార్డ్ అందుకున్న సంపత్ ను తోటి ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల 108 కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

# జీతాలియ్యట్లే..

- మిషన్ భగీరథలో శ్రమ దోపిడీ
- ఏండ్ల తరబడి అరకొర వేతనాలే
- వీకాఫ్‌లు అమలు చేయట్లే..
- జేబులు నింపుకుంటున్న కాంట్రాక్ట్ సంస్థలు

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మిషన్ భగీరథ' పథకం 'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్న చందంగా మారింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏండ్లు గడుస్తున్నా.. పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ చేరింది లేదు. కానీ పథకం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థలు మాత్రం తమ జేబులు నింపుకుంటూ.. కార్మికుల పొట్ట కొడుతున్నాయి. దాదాపు నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో పెట్టడమే కాదు.. కనీసం ఈఎస్ఐ, పీఎఫ్‌ను అమలు చేయడం లేదు. కొంతమంది అక్రమార్కులు..ఒక్కో ఉద్యోగి నియామకం కోసం రూ.లక్ష వరకు వసూలు చేసిన దాఖలాలు లేకపోలేదు. అయినా నేటికీ ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకపోనూ నాలుగు నెలులుగా వేతనాలు చెల్లించకపోవడం మిషన్ భగీరథ సిబ్బంది భగ్గుమంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు దశల్లో మిషన్ భగీరథ పథకం అమలవుతోంది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లా పరిధిలో 3,333 గ్రామాల్లోని ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. అయితే అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సిబ్బంది నియమించుకుంది. అయితే వీరికి న్యాయంగా అందాల్సిన వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, సీఎల్, వీకాఫ్ తదితర సౌకర్యాలేవీ అమలు కావడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తంగా 1,650 మంది సిబ్బంది మిషన్ భగీరథ పథకంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే రాష్ట్రవ్యాప్తంగా చూస్తే.. దాదాపు 16వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. నిజానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో పనిచేస్తున్న సిబ్బందిని 4 ఏజెన్సీల ద్వారా రిక్రూట్ చేసుకున్నారు. ఇందులో అటెండర్ దగ్గరి నుంచి ప్లాంట్ సూపర్‌వైజర్ల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇదిలావుంటే.. పానగల్, చందనపల్లి, అవంతిపురం, ఇమాంపేట, మోతే, గోపాలయపల్లి, లింగోటం, కోదండపురం ప్రాంతాల్లో మిషన్ భగీరథ పంపింగ్ స్టేషన్లు ఉన్నాయి.

**పంప్ ఆపరేటర్ల అరిగోస**

మిషన్ భగీరథ నీటి సరఫరాలో పంప్ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తారనే చెప్పాలి. అయితే పంప్ ఆపరేటర్ల నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. అయితే ఈ పంప్ ఆపరేటర్లకు గత నాలుగు నెలలుగా



కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదు. దీనికితోడు పలు కంపెనీ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకపోవడం కొసమెరుపు. దీంతో పంప్ ఆపరేటర్ల బాధ వర్ణనాతీతంగా మారింది. చివరకు సిబ్బందికి గుర్తింపు కార్డులు, వీక్లీ ఆఫ్‌లు, సీఎల్‌లను అమలు చేయడం లేదు.

**పెండింగ్‌లో వేతనాలు.. ఈఎస్ఐ, పీఎఫ్**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ పథకం పరిధిలో దాదాపు 1650 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత మిషన్ భగీరథ పథకంలో గత 5 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఆయా కంపెనీలు కార్మికులు ఒప్పందంలో ఉన్న వేతనాలను సైతం చెల్లించడం లేదు. దీనికితోడు పెరిగిన నిత్యావసరాల ధరలు, విద్య, వైద్యం, పెట్రోల్ ఖర్చులు విపరీతంగా పెరగడంతో వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో కార్మిక కుటుంబాలపై పెనుభారం మోపినట్టు అవుతోంది. దీంతో సదరు కార్మిక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఇటు రాష్ట్ర ప్రభుత్వం.. అటు అధికారులు స్పందించి మిషన్ భగీరథ కార్మికులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

# విద్యుత్ కొరతకు చెక్

- పదేళ్లలోనే మోడీ ఘనత
- బొగ్గు కొరత లేకుండా చూడటమే కారణం
- బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు



**విశ్వంభర, ఢిల్లీ:** అన్ని రాష్ట్రాల్లో గత పదేండ్లలో ప్రధాని మోడీ విద్యుత్ కొరతకు చెక్ పెట్టారని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. కేంద్ర బొగ్గు, గనుల మంత్రిగా గురువారం కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తనకు రెండు శాఖల బాధ్యతలు ఇచ్చారన్నారు. ఈ మేరకు ఇవాళ బొగ్గు, మైనింగ్ శాఖల మంత్రిగా బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. ఇప్పటి వరకు ప్రహ్లాద్ జోషి, అంతకు ముందు పీయూష్ గోయల్ ప్రధాని మోడీ ఆశీర్వాదంతో ఈ శాఖలో పనిచేశారన్నారు. ప్రజల జీవితాల్లో విద్యుత్ రంగం కీలకంగా ఉన్నదన్నారు. పదేండ్ల క్రితం దేశంలో తీవ్ర విద్యుత్ కొరత ఉండేదని అన్నారు. హైదరాబాద్ లో పారిశ్రామికవేత్తలు సమ్మె చేసిన ఘటనలు మనం చూశామన్నారు. కరెంట్, నీళ్ల కొరత ఉండేది. పంటలు ఎండి పోయేవి. అన్ని రాష్ట్రాల్లో గత పదేండ్లలో ప్రధాని మోడీ విద్యుత్ కొరతకు చెక్ పెట్టారు. ప్రధాని మోడీ నాయకత్వంలో గత పదేండ్ల నుంచి వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహాలకు సరిపోను కరెంట్ వస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో దీన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి మనం కొంత దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మన అవసరాలకు సరిపోయేలా బొగ్గు ఉత్పత్తిని పెంచుతామన్నారు. దేశంలో ఉన్న ఖనిజాలను బయటకు తీయడం, ఉపాధి అవకాశాలను పెంచడం, భారత్ ఖనిజాలు ఇతర దేశాలకు ఎగుమతి చేసి ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తామన్నారు. దేశ ప్రజల ఆకాంక్షల మేరకు, మోడీ సంకల్ప్ పత్రంలో పేర్కొన్నట్టుగా ఈ ఐదేండ్లు పూర్తి స్థాయిలో నాకు అప్పగించిన శాఖల బాధ్యతలను నెరవేరుస్తానని తెలిపారు. శక్తివంతమైన భారత్ ను రూపొందించడంలో బొగ్గు, మైనింగ్ శాఖల పాత్ర కీలకం అన్నారు. దాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ శాఖల్లో చాలా సీనియర్, ఉత్తమ అధికారులు ఉన్నారన్నారు. వారందరితో కలిసి టీమ్ వర్క్ తో పనిచేసి భారత్‌ను అగ్ర పథంలో నడిపించేందుకు క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో పనిచేస్తానని కిషన్ రెడ్డివ తెలిపారు.

# దేశం కోసం నా సేవలు

## 'హోం' బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్



**విశ్వంభర, ఢిల్లీ:** హోం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మంత్రిత్వ శాఖ సిబ్బంది నూతన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హంపి మఠం శ్రీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ జగద్గురు విద్యారణ్య భారతి స్వామీజీ కూడా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల మార్గదర్శకత్వంలో దేశ భద్రత కోసం తనను తాను అంకితం చేసుకోవడానికి ఎదురుచూస్తున్నానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఆయన సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ ఎక్స్ లో ఒక సందేశాన్ని పోస్ట్ చేసారు.. 'నా వైపు , నా మద్దతు వ్యవస్థలో ఉన్నందుకు మీలో ప్రతి ఒక్కరికి నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. నా నాయకుడు గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, గౌరవనీయులైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ అధినేత జేపీ నడ్డాకు, తెలంగాణ పార్టీ కేడర్, మీడియా, సోషల్ మీడియా యోధుల మద్దతు కారణంగానే ఈ తలుపులు తెరుచుకున్నాయి. మరీ ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు. దేశం కోసం నా సేవలో నాకు మద్దతునివ్వాలని నేను మిమ్మల్ని హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను.' అని బండి సంజయ్ పేర్కొన్నారు.




# దేశ రక్షణే మా ప్రాధాన్యత

- ఆత్మనిర్భర్ భారత్‌గా అభివృద్ధి చేస్తాం
- కేంద్ర రక్షణ మంత్రిగా రాజ్‌నాథ్ సింగ్ బాధ్యతలు

**విశ్వంహర, ఢిల్లీ:** కేంద్ర రక్షణ శాఖ మంత్రిగా వరుసగా రెండోసారి రాజ్ నాథ్ సింగ్ బాధ్యతలు అందుకున్నారు. గురువారం ఉదయం సౌత్ బ్లాక్ వద్దకు చేరుకున్న రాజ్ నాథ్‌కు అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో రక్షణ మంత్రిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి తనకు రక్షణ మంత్రిత్వ శాఖ బాధ్యతలను కేటాయించినట్లు చెప్పారు. ఇందుకు ప్రధానికి రాజ్‌నాథ్ కృతజ్ఞతలు తెలిపారు. మా ప్రాధాన్యతలు ఒకే విధంగా ఉంటాయని, అదే దేశ రక్షణ. బలమైన, ఆత్మనిర్భర్ భారత్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకూ 21,000 కోట్ల రూపాయలకు పైగా రక్షణ పరికరాలను ఎగుమతి చేశామని, రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్యను రూ. 50,000 కోట్లకు తీసుకెళ్లడం మా లక్ష్యమని అని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ తెలిపారు.





# ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతాం

- కీలక బాధ్యతలు అప్పగించిన మోడీకి థ్యాంక్స్
- సమర్థ నాయకత్వం చంద్రబాబు నుంచి నేర్చుకున్నా
- బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ నాయుడు

**విశ్వంభర, ఢిల్లీ:** పౌర విమానయాన శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కింజరపు రామ్మోహన్ నాయుడు బాధ్యతలు చేపట్టారు. గురువారం ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేబినెట్‌లో అత్యంత చిన్న వయస్సులో కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువతపై ప్రధానికి ఉన్న నమ్మకమేంటో అర్థమవుతుందని పేర్కొన్నారు. వందరోజుల ప్రణాళిక తయారు చేసి, దాన్ని అమల్లోకి తీసుకొస్తామని వెల్లడించారు. సాంకేతికత వినియోగంతో పౌర విమానయానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు. సామాన్య ప్రయాణికుల కోసం ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతామని వివరించారు. సమర్థ నాయకత్వం ఎలా ఉండాలనేది చంద్రబాబు నుంచి నేర్చుకున్నానని ఆయన అన్నారు. ఎయిర్‌పోర్టుల నిర్మాణం వేగవంతం చేస్తామని తెలిపారు. 2014లో బాధ్యతలు చేపట్టిన అశోక్‌గజపతిరాజు విమానయాన శాఖలో మంచి పునాదులు వేశారని కొనియాడారు. ఉడాన్ స్కీమ్ కూడా ఆయన హయాంలోనే వచ్చిందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

# నీట్ పరీక్ష పేపర్లు లీకయ్యాయి



- ప్రమాదంలో విద్యార్థుల భవిష్యత్
- యువత భవిష్యత్తును మోడీ సర్కార్ నాశనం చేసింది
- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే డిమాండ్

**విశ్వంభర, ఢిల్లీ:** ప్రధాని మోడీ ప్రభుత్వ చర్యలతో నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. నీట్ పరీక్షలో గ్రేస్ మార్కుల సమస్య ఒక్కటే కాదని, పరీక్ష పేపర్లు లీకయ్యాయని అన్నారు. నీట్ కుంభకోణంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని కాంగ్రెస్ గురువారం మరోసారి డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ) డైరెక్టర్ జనరల్‌ని తొలగించాలని పునరుద్ఘాటించింది. ఈ అంశంపై దేశ ప్రజల్లో ఉన్న ఆగ్రహం పార్లమెంటులో కూడా ప్రతిధ్వనిస్తుందని కాంగ్రెస్ హెచ్చరించింది. నీట్ పరీక్ష వివాదంపై విచారణ చేపట్టాలన్న దేశవ్యాప్త డిమాండ్‌పై మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధ్యతా రాహిత్యం, అవివేకమని మండిపడింది. గ్రేస్ మార్కులు ఒక్కటే సమస్య కాదని, నీట్ పరీక్షల్లో రిగ్గింగ్ జరిగిందని, ప్రశ్నాపత్రం లీకైందని, అవినీతి జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వ చర్యల కారణంగా 24 లక్షల మంది నీట్ అభ్యర్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా మోడీ ప్రభుత్వం రిగ్గింగ్, పేపర్ లీక్‌లతో కోట్లాది మంది యువకుల భవిష్యత్తును నాశనం చేసిందని మండిపడ్డారు. ఎగ్జామ్ సెంటర్, కోచింగ్ సెంటర్‌ల మధ్య సంబంధం ఏర్పడిందని, దీంతో నగదు చెల్లించు, ప్రశ్నాపత్రం తీసుకో అనే గేమ్ ఆడుతున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం తన చర్యల పరిణామాలను ఎన్‌టిఎ భుజాలపై పడేసి, బాధ్యతల నుండి తప్పించుకోలేదని అన్నారు. నీట్ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు జరపాలని ఉద్ఘాటించారు. ఒకవేళ సీబీఐ విచారణకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేకపోతే, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయమైన విచారణ జరిపించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌కు కట్టుబడి ఉండాలని ఖర్గే చెప్పారు.



# టీటీడీని ప్రక్షాళన చేస్తాం.. తిరుమల పవిత్రతను కాపాడుతాం

- తిరుమలలో గోవింద నామస్మరణం తప్ప మరొకటి వినిపించకూడదు
- స్వార్థ ప్రయోజనాల కోసం గత పాలకులు తిరుమలను అపవిత్రం చేశారు
- రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమైంది..
- తిరుమల కొండపై మీడియాతో సీఎం చంద్రబాబు నాయుడు

విశ్వంభర, తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానం నుండే ఏపీలో ప్రక్షాళన మొదలుపెడతామని, తిరుమలలో ఓం నమో వెంకటేశాయా, గోవింద నామస్మరణ తప్ప మరో నినాదమే వినపడకుండా చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గత పాలకుల హయాంలో తిరుమల కొండపైకి గంజాయితో పాటు నాన్ వెజ్, మద్యం తీసుకొచ్చి పవిత్రమైన తిరుమలను అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన గురువారం ఉదయం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సీఎం తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు కొండపైన మీడియాతో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, 'మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారన్నారు. 93 శాతం స్ట్రైక్ రేట్ ఎప్పుడూ దేశ, రాష్ట్ర చరిత్రలో రాలేదన్నారు. తాను ఏ సంకల్పం తీసుకున్నా వేంకటేశ్వరస్వామిని తలచుకుని ముందుకు వెళ్తానన్నారు. చిన్నతనంలో కూడా దేవుడికి మొక్కులు తీర్చుకోవడానికి నడిచివచ్చేవాళ్లమని, ఆయన ఆశీస్సులతో అంచలంచెలుగా ఎదిగి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం, దేశ రాజకీయాల్లో పాత్ర పోషించానని స్పష్టం చేశారు. 2003లో వేంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వస్తుంటే క్లేమోర్ మైన్స్ పేలాయి.. అప్పుడు ఆ ఏడుకొండలవారే నన్ను బతికించారన్నారు. ఆయన సేవకు వచ్చి చనిపోతే అపవాదు వస్తుందనో, నా వల్ల ఈ రాష్ట్రానికి..తెలుగుజాతికి ఇంకా మంచి చేయాలన్న ఆశీస్సులతోనో ప్రాణభిక్ష పెట్టారని స్వామిని గుర్తు చేసుకున్నారు. తిరుపతిలో అన్నదాన కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ప్రవేశపెట్టారని, తన మనవడు దేవాన్ష్ ప్రతి పుట్టినరోజు నాడు అన్నదానానికి విరాళం అందిస్తున్నానని సీఎం తెలిపారు. తాను ఎక్కువగా పూజలు చేయకపోయినా పవిత్రమైన మనసుతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేవుడ్ని ఒకటే కోరుకుంటానని సీఎం చంద్రబాబు అన్నారు.

**తెలుగుజాతి అత్యున్నత స్థాయిలో ఉండాలి**

ప్రపంచంలోనే భారతదేశం అగ్రస్థానంలో ఉండాలని, అందులో తెలుగుజాతి అగ్రస్థానం ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. సంపద సృష్టించడం ఎంత ముఖ్యమో.. సృష్టించిన సంపద పేదవారికి అందించడం అంతే ముఖ్యమని తెలిపారు. సంపద కొంతమందికే పరిమితం కాకుండా పేదరికం లేని సమాజంగా మారాలన్నారు. పేదరికం లేని రాష్ట్రం, జిల్లాగా మారినప్పుడే మెరుగైన జీవన ప్రమాణాలతో ప్రజలు ముందుకెళ్తారని, ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తగ్గించాలని, ఇది ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలతో సాధ్యం అవుతుందని తెలిపారు. '1995లో సీబీఎన్ పాలన ప్రారంభమైంది. అంతకు ముందు సచివాలయానికే పరిమితమైన పరిపాలన ప్రజల మధ్యన జరిగింది. ఆరోజు చేసిన అభివృద్ధితో వచ్చిన ఫలాలు చూసి ప్రపంచాధినేతలంతా హైదరాబాద్ రావడానికి ప్రయత్నించారు. జరిగిన మంచిని ప్రపంచమంతా గుర్తిచ్చింది.. ఆ గుర్తింపునే మేము తీసుకొచ్చాం. దేశానికి అతిపెద్ద సంపద కుటుంబ వ్యవస్థ. కుటుంబ వ్యవస్థలో ఎనర్జీ రీఛార్జ్ తో పాటు, భద్రత, ఆనందం, బాధలను పంచుకునే భాగస్వాములుగా ఉంటారు. నేను జైల్లో ఉన్నప్పుడు నాకు అండగా కుటుంబం నిలబడింది. జైల్లో కలవడానికి కుటుంబ సభ్యులకు వారానికి రెండు సార్లు మాత్రమే కలవనిచ్చారు. భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. వేంకటేశ్వరస్వామి కలియుగ దేవుడు.. మా ఇంటి ఇలవేల్పు దైవం. బ్రహ్మోత్సవాల సమయంలో ఒక్కపొద్దుతో నిష్ఠగా పూజలు చేసిన తర్వాతే మధ్యాహ్నం భోజనం చేసేవాళ్లం.. ఈ సంస్కృతి చిత్తూరు జిల్లాలో చాలా కుటుంబాల్లో ఉండేది. కలియుగం దైవం వేంకటేశ్వరస్వామిని ఒక్కసారైనా దర్శించుకోవాలని అనుకుంటారు. ఎన్నిసార్లు వచ్చినా మళ్లీ రావాలని కోరుకుంటారు. ప్రపంచంలో మనదేశం ముందుండాలి.. అందులో తెలుగుజాతి అగ్రస్థానంలో ఉండాలి'' అని సీఎం చంద్రబాబు మాట్లాడారు.

**ప్రజలకు మంచి చేసే శక్తిని ఇవ్వాలని శ్రీవారిని కోరుకున్నా..**

''పేదరికం లేని సమాజాన్ని స్థాపించేందుకు నాకు శక్తిసామర్థ్యాన్ని ఇవ్వాలని వేంకటేశ్వరస్వామిని కోరుకున్నా. సంపద లేనప్పుడు.. సృష్టించడం కోసం రెండవ తరం ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చాను. సంస్కరణలతో బ్రహ్మాండమైన రోడ్లు వచ్చాయి. దేశంలో మొదటి నేషనల్ హైవే నెల్లూరుచెన్నైకు ఏర్పాటైంది. అది విజయవంతమవడంతో నాటి ప్రధాని వాజ్‌పేయ్ దేశమంతా అమలు చేశారు. ఈ విధానం జిల్లాలకు కూడా విస్తరించింది. ఫోన్ అన్నం పెడుతుందా అన్నారు.. కానీ ఇప్పుడు నిత్యావసర వస్తువైంది.. ఆయుధమైంది. వర్చువల్ వర్క్ కు కూడా పనికొస్తోంది.'' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఒక్కరి వాడిని కాదు.. అందరి వాడిని**

''పరదాలు కట్టడం అధికారులకు అలవాటైంది. జనాలు కలవకుండా కర్ఫ్యూ పెట్టారు.. ఇలాంటి సంస్కృతి చూస్తే బాధేస్తోంది. పాలనలో కక్ష సాధింపు చర్యలు ఉండకూడదు.. కానీ తప్పు చేసిన వారికి శిక్ష వేయకపోతే దేవుడు కూడా సహకరించరు. మంచివారిని కాపాడుకోవాలి. చెడు వ్యక్తులను శిక్షించి సమాజాన్ని కాపాడాలి. నా జీవితంలో నా కుటుంబానికి ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదు. 35 ఏళ్ల క్రితమే చిన్న వ్యాపారం స్థాపించి పెట్టి నా కుటుంబం రాజకీయాలపై ఆధారపడకుండా చేశాను. నా జీవితంలో కుటుంబానికి ఎక్కువ సమయం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు కుటుంబానికి సమయం ఇస్తా. ఆదరించిన ప్రజలకు రుణపడి ఉంటా. మొన్నటి ఎన్నికల్లో ప్రజలను భయపెట్టారు. నాకు ప్రజలపై అపారమైన నమ్మకం, గౌరవం ఉంది. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలి.. తెలుగువారు ఎక్కడున్నా తమ బాధ్యత నిర్వర్తించాలని కోరుతున్నా. ప్రజలు గెలిచారు.. రాష్ట్రాన్ని నిలబెట్టారు.. ప్రజలను గౌరవించాల్సిన బాధ్యత మాపై ఉంది. నేను ఏ ఒక్కరి వ్యక్తిని కాదు.. అందరి వాడిని. ఐదుకోట్ల ప్రజలకు చెందిన వ్యక్తిని.'' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



**ఐదేళ్ల విధ్వంసంతో 30 ఏళ్లు వెనక్కి**

కొందరు మీడియా ప్రతినిధులు కూడా ప్రజాస్వామ్యం కోసం పోరాడి కోర్టుల చుట్టూ తిరిగారు. వాస్తవాలు చెప్పలేని దుస్థితి అనుభవించారు. నాయకులు, కార్యకర్తలు విపరీతమైన క్షోభ అనుభవించారు. శనివారం వస్తే ఎప్పుడు ఎవరి ఇంటిపైకి ప్రొక్లెయిన్ వస్తుందో.. 41ఏ నోటీసులిస్తారో భయపడే పరిస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు చెట్లు నరకడం, పరదాలు కట్టడం, ప్రొక్లెయిన్ పంపడాలు ఉండవు. రాష్ట్రంలో ఇక ప్రజా పాలన ప్రారంభమైంది. ఉద్యోగులు కూడా ఇబ్బంది పడ్డారు. ప్రజలు కూడా అన్యాయం జరిగిందని చెప్పుకోవడానికి ఇబ్బంది పడ్డారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని నాపై నమ్మకం పెట్టుకున్నారు, ఆ నమ్మకాన్ని నేను నిరూపించుకోవాలి. ఐదేళ్లలో జరిగిన విధ్వంసంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. తిరిగి పునర్నిర్మించుకోవాలి. పాలనలో రాగద్వేషాలకు తావు లేదు. ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించి ప్రభుత్వంలో భాగం కావాలి. 2047 నాటికి దేశం ప్రపంచంలోనే నెంబర్ 1 గా ఉంటుంది. ఏ దేశానికి వెళ్లినా భారతీయులు ఖచ్చితంగా ఉంటారు.. అందులో తెలుగువారు ఎక్కువగా ఉంటారు. టెక్నాలజీ, ఐటీని అందిపుచ్చుకుని అంచలంచెలుగా ఎదిగి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ దాకా వచ్చాం. రాబోయే రోజుల్లో కార్పొరేట్ గవర్నెన్స్, పబ్లిక్ గవర్నెన్స్ లో భారతీయులు రాణిస్తారు. సర్వీస్ ఎకానమీలో భారతీయుల సేవలు ప్రపంచానికి అవసరం ఉంటుంది. 2047 నాటికి తెలుగుజాతి నెంబర్ 1గా ఉంటుంది.'' అని చంద్రబాబు ఆకాంక్షించారు.

**తెలుగు జాతికి పెద్దగా ఉంటా**

''రాష్ట్రంలో పేదరిక నిర్మూలన చేయాల్సి ఉంది. ఆంధ్రపదేశ్ తో పాటు తెలంగాణ కూడా బాగుండాలి. తెలుగుజాతికి నేను పెద్దగా ఉంటా. విభజన జరిగినప్పుడు హైదరాబాద్ తెలంగాణకు వెళ్లింది.. కష్టపడి ఏపీకి మంచి నగరం నిర్మించి అభివృద్ధి చేసి రుణం తీర్చుకోవాలనుకున్నా. అందుకే అమరావతి, పోలవరం ప్రారంభిస్తే అవి రెండూ గత ప్రభుత్వంలో పడకేశాయి, అమరావతి విధ్వంసం పాలైంది.. ప్రజలు, ఎన్డీయే కార్యకర్తల ఆరోగ్యంతో బాగుండాలి.. నేను అనుకున్న సంకల్పం ముందుకు వెళ్లేలా దేవుడు ఆశీర్వదించాలి. తిరుమల పవిత్రమైన దివ్యక్షేత్రం.. ఈ దివ్య క్షేత్రాన్ని అపవిత్రం చేయడం భావ్యం కాదు. ప్రసాదాల నాణ్యత లేకుండా, శుభ్రం లేకుండా తిలోదకాలు తెచ్చారు. ఓం నమో వెంకటేశాయా... గోవింద నామస్మరణ తప్ప మరో నినాదం కొండపై ఉండకూడదు. మొత్తం ప్రక్షాళన చేసి ప్రపంచమంతా అభినందించేలా టీటీడీని తీర్చిదిద్దుతాం. దొంగలే.. దొంగ దొంగ అంటూ అటెన్షన్ డైవర్షన్ చేస్తున్నారు.. అలాంటి వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. సంఘవిద్రోహ శక్తులు, రౌడీలు లేకుండా చేశాను. రాజకీయ ముసుగులో నేరస్తులు ఉండకూడదు. నేరాలు చేసినా తప్పించుకోలేరు.'' అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# నేనే మీ వద్దకు వస్తా త్వరలో జిల్లాల వారీగా పర్యటిస్తా..

**జనసేన అధినేత పవన్ కళ్యాణ్**

**విశ్వంభర; విజయవాడ:** ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కీలక భూమిక పోషించి.. కూటమి విజయంలో ప్రత్యేక పాత్ర పోషించి.. తిరుగులేని విజయాన్ని అందుకున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆ తర్వాత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఆయనపై అభినందనలు, శుభాకాంక్షల వర్షం కురుస్తోంది. అయితే ఈ నేపథ్యంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జనసైనికులకు కీలక విజ్ఞప్తి చేశారు జనసేనాని పవన్ కల్యాణ్.. ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు త్వరలోనే జిల్లాల వారీగా అందరినీ కలుస్తాను అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఏపీ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక నలుచెరుల నుంచి అభినందనలు, శుభాకాంక్షలు అందుతూనే ఉన్నాయి.. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు, మేధావులు, నిపుణులు, సినీరంగంలో ఉన్నవారు, యువత, రైతులు, ఉద్యోగ వర్గాలు, మహిళలు అభినందనలు అందిస్తారు. జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు ఆనందంతో వేడుకలు చేసుకున్నారు.

ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన ఆయన.. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం నన్ను నేరుగా కలిసి అభినందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశిస్తున్నారు.. త్వరలోనే వారందరినీ జిల్లాల వారీగా కలిసి మాట్లాడాలని నిర్ణయించుకున్నాను.. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ కేంద్ర కార్యాలయం ద్వారా తెలియచేస్తాము.. అభినందనలు తెలియజేయడానికి వచ్చేవారు పూల బొకేలు, శాలువాలు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. అదే విధంగా శాసనసభ సమావేశాలు కూడా త్వరలోనే ఉంటాయి. వీటిని పూర్తి చేసుకొని నన్ను అఖండ మెజార్టీతో గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను కలుస్తాను అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ తర్వాత పిఠాపురం నియోజకవర్గంలోని కార్యకర్తలను కలుస్తాను.. ఆ తర్వాత దశలవారీగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తాను అని జనసేనాని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో వెల్లడించారు.



# ఎక్కడికీ పారిపోం..

- ఓడినా జగన్ వెంటే ఉంటాం
- ప్రతిపక్షంలో ఉండడం కొత్తేమీ కాదు
- కొత్త ప్రభుత్వానికి సమయం ఇస్తాం
- మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్



**విశ్వంభర, తాడేపల్లి:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం తాడేపల్లిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమకు ఓటు వేసిన వాళ్లపై దాడులు చేస్తున్నారని, బాధితులకు అండగా ఉంటామన్నారు. ఎన్నికల్లో గెలిచిన వారు ప్రజలకు మంచి చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. కొత్త సర్కారుకి కొంత సమయం ఇస్తామని తెలిపారు. తాము ఎక్కడికీ పారిపోమని, తమకు ప్రతిపక్షంలో ఉండడం కొత్త కాదని చెప్పారు. తమ పార్టీకి సీట్లు రాకపోయినా 40 శాతం ఓట్లు సాధించామన్నారు. లోపాలు సరిదిద్దుకుని ముందుకు వెళతామని తెలిపారు. మంత్రుల నోటి దురుసు వల్ల ఓడిపోయారు అంటున్నారని, అదే నిజమైతే సరిదిద్దుకుంటామని అనిల్ కుమార్ యాదవ్ చెప్పారు. ఓటమి పాలైతే మూలన కూర్చునే పరిస్థితి ఉండదని అన్నారు. జగన్ వెంటే ఉంటామని, ఆయనతోనే నడుస్తామని చెప్పారు. తమ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు. పదేండ్లు ప్రతిపక్షంలోనే ఉన్నామని గుర్తు చేశారు. గతంలో ఎన్ని ఇబ్బందులు పెట్టినా నిలబడ్డామని, ఇప్పుడు కూడా అలాగే ఉంటామని చెప్పారు. ఓడిపోయామని ఇంట్లో కూర్చోమని అన్నారు. ఎక్కడికీ పారిపోమని, ప్రజలకు అందుబాటులో ఉంటామని అనిల్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు

- ఎమ్మెల్సీలు ప్రలోభాలకు లొంగవద్దు
- మనపై కేసులు పెట్టినా భయపడొద్దు
- 40 శాతం ప్రజలు మానతో ఉన్నారు
- ఎన్డీఏ కూటమి హనీమూన్ నడుస్తోంది
- ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి
- మాజీ సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు

విశ్వంభర, విజయవాడ: ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన హనీమూన్ నడుస్తోందని, వాళ్లకు కొంత సమయం ఇచ్చిన తర్వాత పోరాటం మొదలు పెడదామని మాజీ సీఎం జగన్ అన్నారు. గురువారం ఆయన వైసీపీ ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు హయాంలో పాపాలు చాలా త్వరగా పండుతాయని, గతంలోనూ చంద్రబాబు పాపాలు ఎలా పండాయో అందరం చూశామని తెలిపారు. శిశుపాలుడి నూరు తప్పుల మాదిరిగా చంద్రబాబు తప్పులను కూడా లెక్కిద్దామని పిలుపునిచ్చారు. ఆ తర్వాత ప్రజల్లోకి వెళ్లి ముమ్మరంగా పోరాటం సాగిద్దామని పేర్కొన్నారు.

అసెంబ్లీలో వైసీపీకి ఏమంత బలం లేదని, దాంతో అక్కడ అధికార పక్షానిదే ఆధిపత్యం ఉంటుందని జగన్ పేర్కొన్నారు. అయితే మండలిలో వైసీపీకి బలం ఉన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. తమను ఎవరూ ఏమీ చేయలేరని, మహా అయితే నాలుగు కేసులు పెడతారేమో అని జగన్ వ్యాఖ్యానించారు. ఇటీవలి ఎన్నికల ఫలితాలు శకుని పాచికల మాదిరి ఉన్నాయని, ఈవీఎంల గురించి దేశవ్యాప్తంగా చర్చ జరగాలన్నారు. గత కొన్ని రోజులుగా జరిగిన పరిస్థితులు మీకు తెలుసన్నారు. ఎన్నికల ఫలితాలతో మనో స్థైర్యాన్ని కోల్పోవద్దన్నారు. మేనిఫెస్టోను పరమ పవిత్రంగా భావించి 99 శాతం హామీలు అమలు చేశామని, ఫలానా పథకం అమలు జరిగిందా, లేదా అనేది ప్రజలను అడిగి మరీ టిక్ పెట్టించామన్నారు. ప్రజామోదం పొందిన తర్వాత ఎన్నికలకు వెళ్లామని, కానీ ఎన్నికల్లో ఏం జరిగిందో అర్థం కావడంలేదు.

2019 నుంచి 2024 వరకు కాలం వేగంగా గడిచిపోయిందన్నారు. 2029 కూడా అంతే వేగంగా వస్తుందని, సినిమాలో ఇది ఫస్ట్ హాఫ్ మాత్రమేనని, సెకండాఫ్ మిగిలే ఉందన్నారు. గతంలోనూ ఇలాంటి సంక్షోభ పరిస్థితుల నుంచి పైకి లేచామని చెప్పారు. ఓటు వేయని వాళ్లపై అమానవీయ రీతిలో దాడులు చేస్తున్నారుని, ఇదొక పాపమన్నారు. కేంద్రంలో చంద్రబాబుకు అనుకూల పరిస్థితులు ఉండి కూడా ప్రత్యేక హోదా అడగకపోవడం రెండో పాపమన్నారు. రాబోయే రోజుల్లో వీళ్లు ఇంకా చాలా పాపాలు చేస్తారని కామెంట్స్ చేశారు. ఇక, అసెంబ్లీలో మనకున్న సంఖ్యాబలం ప్రకారం ప్రతిపక్ష హోదా ఇస్తారా అనేది సందేహమేనన్నారు. ఓటు వేయలేదని ఆస్తులకు నష్టం కలిగిస్తూ, వ్యక్తులపై దాడులు చేస్తున్న వీళ్లకు మనకు ప్రతి పక్ష హోదా ఇచ్చేంత నైతిక విలువలు ఉన్నాయా? అనేది కూడా సందేహమేనని అన్నారు. మనం కచ్చితంగా ప్రజల్లోనే ఉందామని, రోజులు గడిచే కొద్దీ మనం మరింతగా ప్రజల్లోకి వెళదామన్నారు. గతంలో తాను 14 నెలల పాటు పాదయాత్ర చేశానని, ఆ వయసు, ఆ సత్తువ నాలో ఇప్పటికీ ఉన్నాయని అన్నారు. ప్రజలతో కలిసి పోరాటం ముమ్మరం చేద్దామని మాజీ సీఎం జగన్ నేతలకు దిశ నిర్దేశం చేశారు.



# మంత్రి పదవి దక్కకపోవడంపై బాధ ఏమీ లేదు!



**ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు**

**విశ్వంభర, అమరావతి:** మంత్రి పదవి దక్కకపోవడంపై టీడీపీ సీనియర్ నేత, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి రాకపోవడంపై తనకు బాధేమీ లేదని స్పష్టం చేశారు. గతంలో తనకు కూడా 26 ఏండ్లకే మంత్రి పదవి దక్కిందని చెప్పారు. అప్పుడు సీనియర్లంతా బాధపడ్డారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కొత్త రక్తం రావాలని, యువ మంత్రులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు ఓవర్ యాక్షన్ చేశారని తెలిపారు. వారిని చంద్రబాబు క్షమించినా.. తాను మాత్రం క్షమించనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల కోసం అనేక ఇబ్బందులు పడ్డామని తెలిపారు. ఏపీకి ఇప్పుడు మంచి రోజులు వచ్చాయని పేర్కొన్నారు.టీడీపీ సీనియర్ నేత, నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడికి చంద్రబాబు కేబినెట్ లో చోటు దక్కకపోవడం ఏపీలో చర్చనీయాంశంగా మారింది. కూటమి అధికారంలోకి వస్తే టీడీపీలో అత్యంత సీనియర్ నాయకుడు, చంద్రబాబుకు సమకాలీకుడు అయిన అయ్యన్నపాత్రుడికి మంత్రి పదవి గ్యారంటీ అని చాలామంది ఊహించారు. కానీ అనూహ్యంగా ఆయనకు కేబినెట్ లో చోటు దక్కలేదు. విశాఖ జిల్లా నుంచి వంగలపూడి అనితకు మంత్రి పదవి కేటాయించారు. అయ్యన్నపాత్రుడు అసంతృప్తిలో ఉన్నట్లు చర్చ మొదలయ్యింది. ఈ నేపథ్యంలోనే స్పందించిన అయ్యన్నపాత్రుడు ఆ వార్తలను ఖండించారు.

# న్యూజిలాండ్‌పై వెస్టిండీస్ విక్టరీ

## 13 పరుగుల తేడాతో ఘన విజయం

### సూపర్-8కు వెస్టిండీస్ అర్హత




**విశ్వంభర, స్పోర్ట్స్ :**
టీ20 వరల్డ్ కప్‌లో ఆతిథ్య జట్టు వెస్టిండీస్ వరుస విజయాలతో హోరెత్తిస్తోంది. ట్రిండాడ్ వేదికగా గురువారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి 13 పరుగుల తేడాతో నెగ్గింది. ఈ గెలుపుతో సూపర్8కు అర్హత సాధించింది. మరోవైపు ఓటమి పాలైన న్యూజిలాండ్ తదుపరి దశకు చేరుకోవడానికి అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలుత న్యూజిలాండ్ ఆధిపత్యం చెలాయించింది. కానీ అద్భుత పోరాటంతో వెస్టిండీస్ తిరిగి పోటీలోకి వచ్చి మ్యాచ్‌ను గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (68 నాటౌట్; 39 బంతుల్లో, 2 ఫోర్లు, 6 సిక్సర్లు) అజేయ అర్ధ శతకంతో చెలరేగాడు. బౌల్ట్ (3/16) మూడు, సౌథి (2/21), ఫెర్గూసన్ (2/27) చెరో రెండు వికెట్లతో సత్తాచాటారు. అయితే టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన వెస్టిండీస్ 30 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. తొలి ఓవర్ నుంచే వికెట్ల వేట మొదలుపెట్టిన కివీస్ బౌలర్లు విండీస్ బ్యాటర్లకు చుక్కలు చూపించారు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన రూథర్‌ఫర్డ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లతో స్కోరు బోర్డు ముందుకు నడిపించి పోరాడే లక్ష్యాన్ని కివీస్ ముందు ఉంచాడు. కాగా, అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 136 పరుగులే చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (40; 33 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. మిచెల్ శాంట్నర్ (21 నాటౌట్; 12 బంతుల్లో, 3 సిక్సర్లు) ఆఖర్లో దూకుడుగా ఆడాడు. అల్జారీ జోసెఫ్ (4/19), మొటియ్ (3/25) సత్తాచాటారు. ఛేదనలో ఏ దశలోనూ న్యూజిలాండ్ ఫేవరేట్‌గా కనిపించలేదు. వరుసగా వికెట్లు కోల్పోతూ ఒత్తిడిలోకి వెళ్లింది. ఫిలిప్స్ క్రీజులో నిలిచినప్పటికీ లక్ష్యం దిశగా కివీస్ సాగలేదు. అయితే ఆఖరి ఓవర్‌లో విజయానికి 33 పరుగులు అవసరమవ్వగా శాంట్నర్ మూడు సిక్సర్లు బాది ఓటమి అంతరాన్ని తగ్గించాడు.



# న్యూయార్క్ స్టేడియం కూల్చివేత షురూ!

**విశ్వంభర, స్పోర్ట్స్ :** అమెరికాలో ప్రస్తుతం టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ టోర్నీ కోసం న్యూయార్క్‌లో నసావు కౌంటీ క్రికెట్ గ్రౌండ్ ను ఆగమేఘాల మీద నిర్మించారు. ఇప్పుడు ఇక ఆ స్టేడియంను కూల్చివేయనున్నారు. న్యూయార్క్ లో జరగాల్సిన మ్యాచ్‌లు ముగియడంతో ఆ స్టేడియాన్ని క్లీన్ చేసేందుకు కసరత్తులు సిద్ధం అయ్యాయి. బుధవారం అమెరికాతో భారత్ ఆడిన మ్యాచే ఆ వేదికలో చివరిది.ఇవాళ్టి నుంచి ఈ పాక్షిక స్టేడియాన్ని క్రమంగా తొలగించనున్నారు. కేవలం వంద రోజుల వ్యవధిలోనే నసావు స్టేడియాన్ని నిర్మించారు. అయితే ఈ పిచ్‌పై ఆడిన అన్ని జట్లు తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. అనూహ్యమైన బౌన్స్ ఉన్న ఈ స్టేడియంలో బౌలర్లే పైచేయి సాధించారు. బ్యాటర్లకు పరుగులు తీయడం కష్టం అయ్యింది. మైదానంలో ఉన్న పచ్చికను అడిలైడ్‌ను తీసుకువచ్చి ఇక్కడ పరిచారు.



**నసావులో హయ్యెస్ట్ ఛేజ్ ఇండియాదే**

పది రకాల డ్రాప్ ఇన్ పిచ్‌లతో ఇక్కడ మైదానాన్ని నింపేశారు. దీంట్లో నాలుగు గ్రౌండ్లు ప్రధానమైనవి కాగా, ఆరు శిక్షణ కోసం వాడారు. బుధవారం మ్యాచ్ తర్వాత క్రమ పద్ధతిలో నసావు స్టేడియాన్ని తొలగించనున్నారు. మైదానం నుంచి తీసిన పచ్చిక లాస్ వెగాస్‌కు తరలించనున్నారు. ఆరు వారాల వ్యవధిలో నసావు స్టేడియాన్ని పూర్తిగా నిర్మూలిస్తారు. ఈ స్టేడియం సామర్థ్యం 34 వేలు. జూన్ 9వ తేదీన భారత్, పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌కు ఈ స్టేడియం పూర్తిగా నిండిపోయింది. చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తున్న ఈ వేదికగా ఇండియా నాలుగు మ్యాచ్‌లు ఆడింది. బంగ్లాదేశ్‌తో ఇదే మైదానంలో ఓ వార్మప్ మ్యాచ్ కూడా ఇండియా ఆడిన విషయం తెలిసిందే. డ్రాప్ ఇన్ పిచ్‌లపై ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు జరిగాయి. దీంట్లో అన్నీ లో స్కోరింగ్ మ్యాచ్‌లే ఉన్నాయి. తొలి రెండు మ్యాచుల్లో ఏ జట్టు కూడా వంద రన్స్ దాటలేదు. పిచ్ వ్యవహరిస్తున్న తీరుపై అంతర్జాతీయ క్రికెట్ మండలి కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. నసావులో హయ్యెస్ట్ ఛేజ్ ఇండియానే చేసింది. అమెరికాపై భారత్ ఛేజింగ్‌లో 111 రన్స్ స్కోర్ చేసింది. ప్లేయింగ్ ఫీల్డ్ కోసం ఫ్లోరిడాలో పెంచిన ప్రత్యేక గడ్డిని వాడారు. ఇక గ్రాండ్ స్టాండ్స్ కోసం వాడిన సామన్లు అన్నీ ఇటీవల లాస్ వెగాస్‌లో ఫార్ములా వన్ రేస్, గోల్ఫ్ ఈవెంట్లలో వాడినవే ఉన్నాయి. నసావు స్టేడియాన్ని తొలగించేందుకు అక్కడకు భారీ సంఖ్యలో బుల్డోజర్లు కూడా చేరుకున్నాయి.



# రికార్డు స్థాయిలో వింబుల్డన్ ప్రైజ్‌మనీ

**విశ్వంభర, స్పోర్ట్స్ :** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌కు చెందిన ప్రైజ్‌మనీని పెంచేశారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 50 మిలియన్ల పౌండ్ల(రూ.534 కోట్లు) ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. సింగిల్స్ ఛాంపియన్‌కు 2.7 మిలియన్ల పౌండ్లు దక్కనున్నాయి. ఈ విషయాన్ని ఆల్ ఇంగ్లండ్ లాన్ టెన్నిస్ క్లబ్ ప్రకటించింది. గత ఏడాది టోర్నీతో పోలిస్తే ఈ ఏడాది ప్రైజ్‌మనీ సుమారు 11.9 శాతం పెంచేశారు. అంటే ఇది సుమారు 5.3 మిలియన్ల పౌండ్లు ఎక్కువ అని అధికారులు పేర్కొన్నారు. టోర్నీ ఫస్ట్ రౌండ్‌లో ఓడిన ఆటగాడికి 60 వేల పౌండ్లు ఇవ్వనున్నారు. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ జూలై 1 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నది.

# నెదర్లాండ్స్‌పై బంగ్లా ఘన విజయం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నెదర్లాండ్స్ ముందు 160 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగా, ఆ తర్వాత డిఫెండింగ్‌లో రాణించింది. ఫలితంగా, డచ్ జట్టుపై 25 పరుగుల తేడాతో గెలిచింది. భారీ ఛేదనలో నెదర్లాండ్స్ జట్టు గట్టి పోటీ ఇచ్చింది. బ్యాటర్లు నిలకడగా ఆడుతూ స్కోరు బోర్డుపై పరుగులు పారించారు. మైఖేల్ లెవిట్ (18), మాక్స్ ఓడౌడ్ (12), విక్రమ్‌జిత్ సింగ్ (26), సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెచ్ట్ (33), స్కాట్ ఎడ్వర్డ్స్ (25), ఆర్యన్ దత్ (15 నాటౌట్) రాణించారు. అయితే, బెంగ్లా బౌలర్లు దాడి చేయడం ప్రారంభించడంతో 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులకే నెదర్లాండ్స్ జట్టు పరిమితమైంది.

# జీఎస్టీలో మార్పులకు ఎన్డీఏ శ్రీకారం..?

**విశ్వంభర, బిజినెస్ :** సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ వరుసగా మూడోసారి విజయం సాధించడంతో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిర్మలా సీతారామన్ వరుసగా రెండోసారి ఆర్థిక మంత్రిగా కొనసాగారు. 2017లో అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిత్వ శాఖ భారతదేశంలో వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని ప్రవేశపెట్టింది. మొదట్లో జీఎస్టీ విధానంపై వ్యాపార వర్గాలు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ జీఎస్టీ సేకరణ ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో రూ. 2.10 ట్రిలియన్లను తాకింది. ఇది బలమైన ఆర్థిక వృద్ధిని ప్రతిబింబిస్తుంది. 202324 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ. 12.01 లక్షల కోట్ల వ్యక్తిగత పన్ను వసూలు చేసింది. ఇందులో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) కూడా ఉంది. ఈ నేపథ్యంలో పన్నులకు సంబంధించి మోదీ ప్రభుత్వం 3.0 నుంచి సామాన్యులకు ఎలాంటి అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు ఎదుర్కోవాల్సి వస్తుందనేది ఆసక్తికరంగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పన్నుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందో? ఓ సారి తెలుసుకుందాం. 2020-21 నుంచి ఆదాయపు పన్ను స్లాబ్‌లు, రేట్లను ప్రభుత్వం సవరించకపోవడం ఆసక్తికరంగా ఉంది. ఈ ఏడాది నితీష్‌కుమార్, చంద్రబాబు నాయుడుతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. అందువల్ల బీహార్, ఆంధ్రప్రదేశ్ ఆదాయపు పన్ను స్లాబ్‌లు, రేట్లను మార్చాలని డిమాండ్ చేయవచ్చు. ఆదాయపు పన్ను బ్రాకెట్లను మార్చే లేదా పన్ను రేట్లను సర్దుబాటు చేసే సామర్థ్యం ప్రభుత్వానికి ఉంది.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు



**విశ్వంభర, బిజినెస్:** బంగారం ధరలు కాస్త శాంతిస్తున్నాయని అనుకుంటున్న తరుణంలో మళ్లీ పెరుగుతున్నాయి. తులం బంగారం ధర మళ్లీ రూ. 75 వేల మార్క్‌కు చేరువయ్యేందుకు సన్నద్ధమైంది. ఇదిలా ఉంటే.. గురువారం మరోసారి బంగారం ధరల్లో మార్పులు కనిపించాయి. బుధవారంతో పోలిస్తే.. మళ్లీ స్వల్పంగా పెరిగాయి. మరి దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

- దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,310గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 72,320 వద్ద కొనసాగుతోంది.
- దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,160కాగా,24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,170గా ఉంది.
- చెన్నైలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,810కాగా, 24 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ. 72,880గా ఉంది.
- కోల్‌కతాలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,160కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,170 వద్ద కొనసాగుతోంది.

**తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు..**

- హైదరాబాద్‌లో సోమవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,160కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,170గా ఉంది.
- విజయవాడలో ఈరోజు 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,160కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,170గా ఉంది.
- విశాఖపట్నం విషయానికొస్తే ఇక్కడ కూడా ఈ రోజు హైదరాబాద్, విజయవాడలో నమోదైన ధరలు మాదిరిగానే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,160కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,170గా ఉంది.

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

వెండి కూడా బంగారం బాటలో పయణిస్తోంది. వాటి ధరలు కూడా స్వల్పంగా పెరిగాయి. కిలో వెండి రూ. 100వరకు పెరిగింది. ఢిల్లీతో పాటు, ముంబయి, కోల్‌కతా, పుణెలో కిలో వెండి ధర రూ. 91,400గా ఉండగా హైదరాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖలో కిలో వెండి ధర రూ. 95,900కి చేరుకుంది. కాగా, ఈ బంగారం ధరలు ఈరోజు ఉదయం ఆరు గంటలకు నమోదైనవిగా గమనించగలరు. బంగారం కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలు చెక్ చేసుకోవడం బెటర్. ఇక లేటెస్ట్ బంగారం ధరలను తెలుసుకోవడానికి, మీరు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# ట్యాక్స్ పేయర్లకు ఐటీ శాఖ హెచ్చరిక..

**ఇంకా 2 రోజులే ఛాన్స్.. తర్వాత భారీ పెనాల్టీలు!**



**విశ్వంభర, బిజినెస్ :** ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే వారికి బిగ్ అలర్ట్. తాజాగా ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం కీలక హెచ్చరికలు చేసింది. పన్ను చెల్లింపుదారులు తమ అడ్వాన్స్ ట్యాక్స్ ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ పేమెంట్ పూర్తి చేయాలని సూచించింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఉద్యోగులు, వ్యాపారస్తులు, వృత్తి నిపుణులు, ఇతర పన్ను చెల్లింపుదారులను అలర్ట్ చేసింది. జూన్ 15, 2024వ తేదీలోపు తమ తొలి విడత అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాలని కోరింది. ' ట్యాక్స్ పేయర్లకు అలర్ట్. అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించేందుకు మీ అర్హతను ఓసారి చెక్ చేసుకుని జూన్ 15, 2024లోపు తొలి విడత పేమెంట్ పూర్తి చేయండి' అంటు సూచించింది. మరి ఎవరి అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాలి? ఎందుకోసం అనేది తెలుసుకుందాం.

**ఏ తేదీల్లో చెల్లించాలి?**

తొలి విడత అడ్వాన్స్ ట్యాక్స్ 15 శాతం కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తర్వాత జూన్ 15 లోపు అడ్వాన్స్‌గా పే చేయాలి. రెండో విడత సెప్టెంబర్ 15వ తేదీ లోపు 45 శాతం చెల్లింపులు పూర్తి చేయాలి. ఆ తర్వాత డిసెంబర్ 15వ తేదీలోపు మీ ట్యాక్సులో 75 శాతం అడ్వాన్స్ రూపంలో చెల్లించాలి. మార్చి 15లోపు 100 శాతం అడ్వాన్స్ రూపంలో చెల్లించేయాలి. ఇన్‌కమ్ ట్యాక్స్ వెబ్‌సైట్‌లో ఇపే ట్యాక్స్ ఆప్షన్ లోకి పాన్ కార్డు, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ కావాలి. అడ్వాన్స్ ట్యాక్స్ ఆప్షన్‌లో పేమెంట్ మోడ్ ఎంపిక చేసుకోవాలి. పే నౌ క్లిక్ చేసి చెల్లించాలి. మీకు ఓ రిసిప్ట్ వస్తుంది.

**అడ్వాన్స్ ట్యాక్స్ అంటే ఏమిటి?**

అడ్వాన్స్ ట్యాక్స్ అనేది ఇన్‌కమ్ ట్యాక్స్ పేమెంట్‌లో ఒక భాగం. ఒకేసారి పెద్ద మొత్తంలో పన్ను చెల్లించకుండా ముందస్తుగా నిర్దేశించిన తేదీల్లో విడతల వారీగా పన్ను కట్టాల్సి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ట్యాక్స్ రూ.10 వేలు అంతకన్నా ఎక్కువ ఉన్నప్పుడు పన్ను చెల్లింపుదారులు, ఉద్యోగులు, ఫ్రీలాన్సర్స్, వ్యాపారస్తులు అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, 60 ఏళ్ల వయసు దాటిన సీనియర్ సిటిజన్లకు బిజినెస్ నుంచి రాబడి లేనట్లయితే వారికి మినహాయింపు ఉంటుంది. అంటే వారు ఈ అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లింపులు చేయాల్సిన అవసరం లేదు. ఇన్‌స్టాల్మెంట్ వారిగా ఆర్థిక సంవత్సరం చివరి రోజు మార్చి 31 నాటికి మొత్తం ట్యాక్స్ చెల్లింపులు చేసేయాల్సి ఉంటుంది.

# ముంచుకొస్తున్న భారీ ముప్పు..

## వచ్చే ఏడాదే ఎవ్వరూ నమ్మలేనంతగా స్టాక్ మార్కెట్ క్రాష్..?

**విశ్వంభర, బిజినెస్ :**

మార్కెట్ ట్రెండ్స్‌తో పాటు సమాజ స్థితిగతులు గతంతో పోల్చి చూస్తే ప్రస్తుతం బాగానే ఉన్నాయి. కొన్ని దేశాలు మినహా చాలా దేశాల్లో పేదరికం కంట్రోల్‌లోనే ఉంది. ప్రస్తుత విషయం పక్కన పెట్టి 2008 ఆర్థిక సంక్షోభం గురించి కొంత మంది నిపుణులు గుర్తు చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో 2008కి మించి ఆర్థిక సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని వివరిస్తున్నారు. భారీ ఆర్థిక సంక్షోభానికి సంబంధించిన రాబోయే రోజుల్లో స్టాక్ మార్కెట్ క్రాష్ అయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ యూఎస్ ఆర్థికవేత్త హ్యారీ డెంట్ హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ అనేది బుడగ మాదిరి ఉందని అది ఎప్పటికైనా పేలిపోయే అవకాశాలు చాలా ఉన్నాయని హెచ్చరించారు. హ్యారీ డెంట్ తాజా హెచ్చరికల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. సాధారణంగా హ్యాంగోవర్‌ను నయం చేయాలనుకుంటే ఎక్కువ తాగాలని చెబుతూ ఉంటారు. ఆర్థిక వ్యవస్థలు కూడా ప్రస్తుతం అలాగే తయారయ్యాయని అదనపు డబ్బుతో ఆర్థిక వ్యవస్థను ముంచెత్తడం వల్ల మొత్తం ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలికంగా మెరుగుపడుతుందని భావిస్తారని అది చాలా సందర్భాల్లో ఫెయిల్ అయ్యిందని పేర్కొంటున్నారు. డెంట్ 1989లో జపనీస్ అసెట్ ప్రైస్ బబుల్ బర్స్ట్, 2000లో డాట్‌కామ్ క్రాష్ గురించి కచ్చితంగా అంచనా వేశాడు. ముఖ్యంగా జనాభా ధోరణులు, ఆర్థిక విషయాలు, మార్కెట్ విశ్లేషణపై తన అంచనాలను కచ్చితంగా పేర్కొంటూ ఉంటారు. ప్రస్తుత విషయానికి వస్తే 2008 సంక్షోభం పెద్ద సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాడు. ఎస్‌అండ్ పీ ఎగువ నుంచి 86 శాతం, నాస్‌డాక్ 92 శాతం క్షీణించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడానికి ఫెడరల్ రిజర్వ్ యొక్క వేగవంతమైన ద్రవ్య విధానం కఠినతరం చేయడం వల్ల వచ్చే ఏడాది ప్రారంభంలో నుండి మధ్య మధ్యలో పతనం సంభవించవచ్చని డెంట్ అంచనా వేశారు.

**కోవిడ్-19 మహమ్మారి సంక్షోభం**

కోవిడ్19 మహమ్మారి ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కారణం అయ్యింది. వైరస్ వ్యాప్తిని నియంత్రించడానికి ప్రపంచవ్యాప్తంగా దేశాలు కఠినమైన లాక్డౌన్లు విధించడంతో ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీని ఫలితంగా స్టాక్ మార్కెట్లు క్షీణించడంతో నిరుద్యోగం రేట్లు విపరీతంగా పెరగడంతో తీవ్ర ప్రపంచ మాంద్యం ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలు వ్యాపారాలు, వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి భారీ ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీలతో ప్రతిస్పందించాయి. అయినప్పటికీ ఆర్థిక ప్రభావం చాలా విస్తృతంగా ఉంది.

# బన్నీ ఫ్యాన్స్ కు షాక్.. పుష్ప2 విడుదల వాయిదా..?



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప మూవీ అప్పట్లో భారీ విజయం సాధించింది. పాన్ ఇండియా సినిమాగా వచ్చి అన్ని భాషల్లో చాలా పెద్ద హిట్ కొట్టింది. దాంతో బన్నీకి నేషనల్ వైడ్ గా ఫ్యాన్స్ ఏర్పడ్డారు. దానికి సీక్వెల్ గా ఇప్పుడు పుష్ప 2 సినిమా రాబోతోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, సాంగ్స్ భారీ అంచనాలను పెంచేశాయి. రీసెంట్ గా వచ్చిన సూసేకి అగ్గిరవ్వ మాదిరి సాంగ్ అయితే దేశాన్ని ఊపేస్తోంది. ఈ పాటపై ఇప్పటికే సోషల్ మీడియాలో రీల్స్ తెగ హల్ చల్ చేస్తున్నాయి. సినిమా స్టార్లు కూడా ఈ సాంగ్ కు రీల్స్ చేస్తుండటంతో భారీ హైప్ క్రియేట్ అయిపోయింది. అయితే ఈ సినిమా లవర్స్ కు ఇప్పుడు భారీ షాక్ తగలనున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాను ఆగస్టు 15కు రిలీజ్ చేస్తామని ఇప్పటికే మూవీ టీమ్ ప్రకటించింది. కానీ తాజాగా మూవీ రిలీజ్ డేట్ ను వాయిదా వేస్తున్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే మూవీ ఎడిటర్ మారడంతో పాటు వీఎఫ్ఎక్స్ సరిగ్గా లేదని డైరెక్టర్ సుకుమార్ అసంతృప్తిగా ఉన్నారంట. దాంతో పాటు మూవీ షూటింగ్ కూడా కంప్లీట్ కాకపోవడంతో మరో నెల రోజులు సమయం పట్టేలా ఉందంట. కాబట్టి సెప్టెంబర్ లో రిలీజ్ చేయడంపై ఆలోచిస్తున్నారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే ఛాన్స్ ఉంది.

# సన్నీలియోన్ డ్యాన్స్‌కు నో చెప్పిన యూనివర్సిటీ వీసీ



విశ్వంభర, సినిమా: బాలీవుడ్ నటి సన్నీ లియోన్‌కు షాక్ తగిలింది. ఓ యూనివర్సిటీలో ఆమె డ్యాన్స్ షోకు అనుమతి నిరాకరించారు. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో జూలై 5న సన్నీలియోన్ నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అయితే.. ఈ డ్యాన్స్ షోకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ (వీసీ) డాక్టర్ మోహనన్ కున్నుమ్మల్ అనుమతి నిరాకరించారు. ప్రోగ్రామ్ లిస్ట్‌లో ఆమె డ్యాన్స్ షోను చేర్చొద్దని ఆదేశాలు జారీ చేశారు. క్యాంపస్ లోపల లేదా వెలుపల ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి యూనియన్‌ను అనుమతించబోమని ఆయన ఉద్ఘాటించారు. కాగా..ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి విశ్వవిద్యాలయ అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందడంలో కళాశాల యూనియన్ కూడా విఫలమైందనట్లు తెలుస్తోంది. అయితే.. గతేడాది నవంబర్‌లో కేరళలోని ఎర్నాకులం జిల్లాలోని కొచ్చిన్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కుశాట్)లో సంగీత కచేరీ నిర్వహించారు. ఈ కచేరీలో తొక్కిసలాట జరిగి నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికి పైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో కాలేజీ క్యాంపస్‌లలో ఎక్స్‌టర్నల్ డీజే పార్టీలు, మ్యూజిక్ నైట్‌లు మొదలైన వాటిపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ క్రమంలో సన్నీ లియోన్ డ్యాన్స్ షోకు వీసీ అనుమతి నిరాకరించినట్లుగా పలు రిపోర్టులు చెబుతున్నాయి.

# ఆద్య గురించి రేణూ దేశాయ్ ఎమోషనల్ పోస్ట్..



విశ్వంభర, సినిమా: తమ కూతురు ఆద్య గురించి జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాజీ భార్య రేణూ దేశాయ్ ఎమోషనల్ పోస్ట్ చేసింది. ఆద్య తన తండ్రి పవన్ కల్యాణ్, అకీరాతో కలిసి ఢిల్లీకి వెళ్లలేకపోయిందని చెప్పింది.ఆ రోజున ఆద్య పాఠశాల పున:ప్రారంభం కావడంతో ప్రధాని మోదీని కలవాలనే ఆమె కోరిక అప్పట్లో తీరలేదని, చివరకు నిన్న అకీరా తన తండ్రి పవన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆమెను మోదీకి పరిచయం చేశాడని తెలిపింది. తన టీనేజ్ నుంచి తాను బీజేపీని ఎంతగానో అభిమానించే వ్యక్తినని రేణూ దేశాయ్ చెప్పింది. కనీసం తన పిల్లలయినా వారి తండ్రివల్ల ప్రధాని మోదీని కలిశారని, అందుకే ఒక తల్లిగా తాను చాలా సంతోషిస్తున్నాని తెలిపింది. కాగా, పవన్ కల్యాణ్ తో పాటు ఇటీవల అకీరా ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆద్య కనపడలేదు. పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి అకీర, ఆద్య ఇద్దరూ వచ్చారు.

# అలాంటి మగాళ్లు కూడా ఉన్నారు.. నమ్మితే అంతే..



విశ్వంభర, సినిమా: ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ హీరోయిన్‌గా చేతినిండా సినిమాలతో దూసుకుపోతుంది నేషనల్ క్రష్ రష్మిక మందన్నా. ఇటీవలే యానిమల్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు పుష్ప 2, గర్ల్ ఫ్రెండ్, రెయిన్ బో చిత్రాల్లో నటిస్తుంది. ప్రస్తుతం ఈ మూవీ చిత్రాలు శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నాయి. అటు వరుస చిత్రాలతో బిజీగా ఉంటున్న రష్మిక.. ఇటు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్. ఎప్పటికప్పుడు మూవీ అప్డేట్స్, ఫోటోషూట్స్ షేర్ చేస్తుంటుంది. అలాగే కొన్నిసార్లు నెట్టింట అభిమానుల పోస్టులకు రిప్లై ఇస్తుంటుంది. తాజాగా ఓ నెటిజన్ చేసిన పోస్టుకు ఆసక్తికర ఆన్సర్ ఇచ్చింది రష్మిక. ఇటీవల యానిమల్ సినిమాలో గీతాంజలి పాత్రలో తనదైన నటనతో ప్రశంసలు అందుకుంది రష్మిక. బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.900 కోట్లు రాబట్టిన ఈ సినిమాపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా రణబీర పాత్రపై ఆగ్రహం చూపించారు. ఇందులో స్త్రీలను తక్కువ చేసి చూపించారని ఆరోపణలు వచ్చాయి. కానీ రష్మిక నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో రణబీర్ తన భార్య గీతాంజలిని ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. కానీ ఆ తర్వాత ఆమెను జోయాను ప్రేమిస్తాడు. ఇందుకు సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ "గుర్తుంచుకోండి. మనిషిని నమ్మడం కంటే భయంకరమైనది ఏదీ లేదు" అంటూ యూజర్ క్యాప్షన్ ఇచ్చారు. ఇక పోస్టుపై రష్మిక స్పందిస్తూ.. "కరెక్షన్.. స్టుపిడ్ ను నమ్మితే భయంకరం. చాలా మంది మంచి పురుషులు కూడా ఉన్నారు. వారిని నమ్మడం కూడా ప్రత్యేకమే" అంటూ లవ్ ఎమోజీని షేర్ చేసింది. ప్రస్తుతం రష్మిక కామెంట్ నెట్టింట వైరలవుతుంది. ఇదిలా ఉంటే రష్మిక నటిస్తున్న పుష్ప 2 చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది. డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.



# నాలుగు నెలలకే అబార్షన్ అయింది.. కుంగిపోయా.. నమిత ఆవేదన

హీరోయిన్ నమిత గురించి సౌత్‌ఇండియాలో ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. అప్పట్లో తన అంద, చందాలతో కుర్రాళ్లను ఊపేసింది. ఆమె జెమిని, నాయకుడు, బిల్లా, ఓయ్ సినిమాల్లో నటించింది. తెలుగు చిత్రాలతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ నటించింది ఈ ముద్దుగుమ్మ. అప్పట్లో స్టార్ హీరోయిన్ల రేసులో ఆమె ఉండేది. కానీ తెలుగుకంటే వేరే భాషల్లోనే ఎక్కువగా నటించింది. అయితే ఆమె ఇండస్ట్రీకి దూరం అయి చాలాకాలం అవుతోంది. 2020లో మాయ అనే తమిళ మూవీలో చివరిసారిగా నటించింది. ఇక తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడి తన ప్రెగ్నెన్సీ కష్టాలను వివరించింది. నేను 2021మొదటిసారి ప్రెగ్నెంట్ అయ్యాను. అప్పుడు నేను అమ్మనాన్నలతో కలిసి సూరత్ లో ఉండేదాన్ని. కానీ నాకు సంతోషం ఎక్కువ కాలం లేకుండాపోయింది. ఎందుకంటే నాలుగు నెలలకే గర్భ స్రావం అయింది. దాంతో తీవ్రంగా డిప్రెషన్ లోకి వెళ్లిపోయాను. కానీ అదృష్టంతో మరోసారి ప్రెగ్నెంట్ అయ్యాను. నాకు 2022లో ట్విన్స్ పుట్టారు. ఇప్పుడు ఫ్యామిలీతో చాలా సంతోషంగా గడుపుతున్నాను అంటూ తెలిపింది హీరోయిన్ నమి. ఆమె వీరేంద్ర చౌదరిని 2017లో పెళ్లాడింది. ప్రస్తుతం మరోసారి సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తోంది నమిత.

# కుక్క కరిస్తే చనిపోతారా..?

## ఎన్ని గంటలలోపు చికిత్స అందించాలి..?

**విశ్వంభర, ఫీచర్ :**

జంతువుల కాటు అనేక తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుంది. వాటిలో ఒకటి రేబిస్. ఇది మనిషి మరణానికి కూడా దారి తీస్తుంది. అలాంటి రేబిస్‌కు సరైన చికిత్స అందుబాటులో లేదు. రేబిస్ వల్ల చాలా మంది చనిపోతున్న వార్తలు ప్రతినిత్యం అనేకం వింటుంటాం. రేబిస్ అనేది జంతువుల వల్ల కలిగే ఒక రకమైన ఇన్ఫెక్షన్. ఇది వాటి కాటు ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. రేబిస్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే, అది ప్రాణాంతకంగా మారుతుంది. చాలా సందర్భాల్లో రేబిస్ బారినపడ్డ బాధితులు మరణిస్తున్నారు. పిచ్చి కుక్క కరిచిన ఎన్ని రోజుల తరువాత వ్యాధి తీవ్రత, మరణ ప్రమాదం ఉంటుంది..? మీరు దానిని ఎలా నివారించాలో తెలుసుకోవటం తప్పనిసరి. 2023లో ఢిల్లీకి ఆనుకుని ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో 14 ఏళ్ల చిన్నారి రేబిస్‌తో మరణించింది. హృదయ విదారకమైన ఈ వార్త ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. వాస్తవానికి నెల రోజుల క్రితం చిన్నారిని కుక్క కరిచింది. సకాలంలో చికిత్స జరగకపోవడంతో రేబిస్ ఇన్ఫెక్షన్ పెరుగుతూ వచ్చింది. కొన్ని రోజుల తర్వాత, ఆ చిన్నారిలో వింత లక్షణాలు కనిపించడం ప్రారంభించాయి. అతను గాలి, నీటికి కూడా భయపడిపోయాడు. కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించే సమయానికి చాలా ఆలస్యం కావడంతో చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.



**ఏ జంతువులు రేబిస్‌ను వ్యాప్తి చేయగలవు?**

రేబిస్ ఏ జంతువులకు వస్తుంది. దాని నుండి మనం ఎలా రక్షించుకోవాలి? అనే విషయంలో నూప్రతి ఒక్కరికీ తప్పనిసరి అవగాహన ఉండాలి. రేబిస్ వ్యాధి సాధారణంగా కుక్కలు, కోతులు, పిల్లులలో ఎక్కువగా కనిపిస్తుంది. ఎందుకంటే అవి మనుషుల చుట్టూ నివసిస్తాయని అంటున్నారు. అవి కరిచినప్పుడు రేబిస్ వైరస్ మనుషులకు వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

**జంతువు కరిచినట్లయితే మొదట ఏం చేయాలి?**

మీరు కుక్క, పిల్లి లేదా కోతి కరిచినట్లయితే మొదట మీరు ఆ ప్రాంతాన్ని బాగా కడగాలి. దీని కోసం మీరు సబ్బు లేదా డిటర్జెంట్‌ను ఉపయోగించవచ్చు. గాయం చాలా లోతుగా ఉంటే, మొదట దానిని సబ్బుతో రుద్ది కడగాలి. ఆపై బెటాడిన్ అప్లై చేయాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించండి. రేబిస్, యాంటీబాడీ, టెటానస్ ఇంజెక్షన్ కోసం సరైన టీకాను తీసుకోవాలి. ఏదైనా జంతువు కాటు వేసిన 24 గంటలలోపు మీరు టీకాను వేయించుకోవాలి. నాలుగు నుండి ఐదు మోతాదుల కోర్సును పూర్తి చేయాలి. కుక్క కాటు తర్వాత, ఐదు ఇంజెక్షన్లు అవసరం.

**రేబిస్ ప్రధాన లక్షణాలు:**

నొప్పి, అలసట, తలనొప్పి, జ్వరం, కండరాలు దృఢత్వం, చిరాకు, దూకుడు స్వభావం, వింత కార్యకలాపాలు చేయడం, పక్షవాతం, నోటి నుండి నీళ్లు కారడం, కన్నీళ్లు ఎక్కువగా కారడం, ప్రకాశవంతమైన కాంతి లేదా చికాకు వంటి విషయాలు రేబిస్ ప్రధాన లక్షణాలు. మాట్లాడటంలో ఇబ్బంది కూడా ఏర్పడుతుంది.

### రేబిస్ అంటే ఏమిటి..?

రేబిస్ అనే ఇన్ఫెక్షన్ ప్రధానంగా జంతువులలో కనిపిస్తుంది. అయితే ఈ వైరస్ సోకిన జంతువుల నుండి కూడా అది మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. రేబిస్ సోకిన జంతువు మనిషిని కాటు వేసినప్పుడు లేదా దాని లాలాజలంతో సంబంధంలోకి వచ్చినప్పుడు ఈ వైరస్ మనిషికి కూడా వ్యాపిస్తుంది. సాధారణంగా దీని లక్షణాలు ఒకటి నుండి మూడు నెలల్లో కనిపిస్తాయి. ఈ సమయంలో చికిత్స తీసుకోకపోతే, సరైన ఇంజెక్షన్లు ఇవ్వకపోతే అప్పుడు మరణం సంభవించే ప్రమాదం ఉంది.

# ఆర్టిఫీషియల్ స్వీటెనర్ జిలిటాల్..

- గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుందంటున్న అధ్యయనం

**విశ్వంభర, ఫీచర్ :** డయబెటీస్ ఉన్న వాళ్లు, వెయిట్ లాస్ అవ్వాలి అనుకున్న వాళ్లు షుగర్‌ను దూరం పెడతారు. కానీ ఆర్టిఫీషియల్ స్వీటెనర్‌కు ఎక్కువ అలవాటు పడతారు. ఆర్టిఫిషియల్ స్వీటెనర్ జిలిటాల్, స్వీట్లు మొదలైన వాటిలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా విస్తృతంగా ఉపయోగించబడుతుంది, ఇది గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుందని ఒక అధ్యయనం తెలిపింది. USలోని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. అధ్యయన నివేదిక యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ప్రచురించబడింది. జిలిటోల్ చూయింగ్ గమ్, కొన్ని టూత్‌పేస్ట్‌లు, మౌత్‌వాష్‌ల వంటి అనేక చక్కెరరహిత




స్వీటెనర్‌లలో ఉపయోగించబడుతుంది. జిలిటాల్ యొక్క అధిక వినియోగం రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుంది. అధ్యయనం ప్రకారం, సిరలు, ధమనులలో రక్త ప్రవాహం తగ్గుతుంది. Xylitol కూడా ప్లేట్‌లెట్ ఫంక్షన్‌లను ప్రభావితం చేయడం ద్వారా రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుందని కనుగొనబడింది.Xylitol సహజంగా పండ్లు, కూరగాయలలో చిన్న మొత్తంలో లభిస్తుంది. Xylitol తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. వాటిలో కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి. ఈ కారణంగా, వారు పారిశ్రామిక ప్రాతిపదికన ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. ఎరిథ్రిటాల్ అనే కృత్రిమ స్వీటెనర్ కూడా రక్తం గడ్డకట్టడానికి కారణమవుతుందని కనుగొనబడింది. షుగర్ తినకూడదు అంటే కేవలం షుగర్ మాత్రమే తినకూడదు అని కాదు. తియ్యగా ఉండే ఏదీ తినకూడదు. షుగర్ కంటే ఆర్టిఫీయల్ స్వీటనర్స్ ఇంకా ప్రమాదం. ఎవరైతే వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవాళ్లు.. తీపిని దూరం చేసుకోవాలి అని ఇలాంటి ఆర్టీఫీయల్ స్వీటనర్స్ వాడి ఆరోగ్యాన్ని ఇంకా నాశనం చేసుకోవద్దు అని నిపుణులు చెప్తున్నారు

# మీ వ్యక్తిత్వం ఎలా ఉంటుందో పుట్టిన సమయమే చెప్తుందట!

**విశ్వంభర, ఫీచర్:** పుట్టిన సమయాన్ని బట్టి మనిషి గుణగణాలు ఉంటాయి అని జ్యోతిష్యం చెబుతుంది. నమ్మడం లేదా అయితే ఈ స్టోరీ చదివేయండి.. ఏ సమయంలో పుట్టిన వారు ఏ విధంగా ఉంటారో ఇక్కడ క్లియర్‌గా ఉంది. ఎంత వరకూ నిజమో తెలుసుకోవాలంటే.. చదవాల్సిందే..!

**12.00 అర్ధరాత్రి నుండి 2.00 (ఉదయం)**

తెలివైనవారు, కుటుంబానికి సన్నిహితులు, సులభంగా ప్రేరేపించబడతారు, జనాదరణ పొందినవారు, కష్టపడి పని చేయడం ద్వారా విజయం సాధించవచ్చు.

**2.00 AM నుండి 4.00 AM (AM)**

మృదుస్వభావి, త్వరగా ధనవంతులు అవ్వండి, సాహసోపేతంగా, ప్రకృతితో కలిసి ఉండండి.

**ఉదయం 4.00 నుండి 6.00 వరకు (ఉదయం)**

అద్భుతమైన వ్యక్తిత్వం, నాయకుడు, కొన్నిసార్లు మొండి పట్టుదలగలవాడు, సవాలును తీసుకోవడానికి ఇష్టపడతాడు, నమ్మదగినవాడు.

**6.00 AM నుండి 8.00 AM (AM)**

నిగూఢమైన వ్యక్తిత్వం, బలమైన వ్యక్తిత్వం, బాధ్యత వహించడం ఇష్టం, స్వభావాన్ని నియంత్రించడం.

**ఉదయం 8.00 నుండి 10.00 వరకు (ఉదయం)**

తత్వవేత్త, శాంతియుత వ్యక్తి, తాదాత్మ్యత, స్నేహపూర్వక స్వభావం, ప్రజలను త్వరగా నయం చేస్తుంది, ప్రయాణాన్ని ఆనందిస్తుంది.

**ఉదయం 10.00 నుండి 12.00 (మధ్యాహ్నం)**

ఆశావాది, క్రమశిక్షణ, సున్నితత్వం, నాయకుడు, ఆర్థికంగా బలవంతుడు.

**మధ్యాహ్నం 12.00 నుండి మ. 2.00 (మధ్యాహ్నం)**

శక్తివంతుడు, ప్రతిష్టాత్మకుడు, సంపన్నుడు, ప్రయాణాన్ని ఇష్టపడతాడు, గురువు, వయస్సుతో పాటు మెరుగుపడతాడు.

**02.00 PM నుండి 4.00 PM (PM)**

ఉత్సుకత, ఆకస్మిక, సాహసోపేతమైన వ్యక్తిత్వం, నాణ్యమైన ప్రేమికుడు, అందరినీ గెలుచుకున్నవాడు, ప్రజలు ఇష్టపడేవారు.

**4.00 PM నుండి 6.00 PM (PM)**

ప్రేమగల, సున్నితమైన, శ్రద్ధగల, అంతర్ముఖుడు, రక్షణ, మంచి గురువు, జీవితం నుండి నేర్చుకునేవాడు.

**సాయంత్రం 6.00 నుండి రాత్రి 8.00 వరకు (రాత్రి)**

సాదాసీదా వ్యక్తి, దయ, సానుభూతి, నిస్వార్థ స్వభావం, అవగాహన, మంచి నాయకుడు.

**రాత్రి 8.00 నుండి రాత్రి 10.00 వరకు (రాత్రి)**

ఆత్మవిశ్వాసం, పరిపూర్ణత, సృజనాత్మకత, సహాయం చేసే స్వభావం, ధనవంతులు కావడానికి ఇష్టపడే వ్యక్తి.

**10.00 PM నుండి 12.00 PM (అర్ధరాత్రి)**

భావి, లక్ష్యం, సంతోషం, సంపన్నమైనది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com